V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
29-07-2024

సంపుటి : 01 | సంచిక : 86 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







## మను భాకర్... భలే షూటర్

### కాంస్యం సాధించిన మన బంగారం

**ఒలింపిక్స్‌లో తొలిపతకం సాధించిన భారత అథ్లెట్**

మను భాకర్.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. ఎవరిని కదిలించినా.. ఏ సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్‌ను చూసినా ఆమె గురించే చర్చ. దేశ ప్రధాని నుంచి సామన్య పౌరుడి వరకు ఆమెకు సలాం చేస్తున్నవారే. పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా... షూటింగ్ ఈవెంట్‌లో మెడల్ సాధించిన తొలి భారత షూటర్‌గా నిలిచిన మను భాకర్.. 130 కోట్ల మంది గర్వపడేలా చేసింది.20 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ ఈవెంట్‌లో ఫైనల్ చేరి అందరి దృష్టిని ఆకర్షించిన మను భాకర్.. ఆదివారం మెడల్ ఈవెంట్‌లోనూ అదే జోరును కొనసాగించి విశ్వవేదికపై మువ్వెన్నెల జెండాను రెపరెపలాడించింది. ఫైనల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. ఈ విజయంతో మను భాకర్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. టీనేజీలోనే సంచలన ప్రదర్శనతో ప్రపంచ మేటి షూటర్లలో ఒకరుగా ఎదిగిన యువ క్రీడాకారిణి మను భాకర్.. ప్రపంచ క్రీడా వేదికపైనా సత్తాచాటింది. టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్ వంటి క్రీడలపై మక్కువ ఉన్నప్పటికీ  షూటింగ్ పైనే దృష్టి సారించిన ఆమె.. తన నిర్ణయంలో గురి తప్పలేదని మరోసారి నిరూపించింది.

(పూర్తి వివరాలు స్పోర్ట్స్ పేజీలో)





## పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నానే

### ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్, కేటీఆర్‌ల బుద్ధి మారలేదు

ఆగస్టు ఆఖరికల్లా రూ.2 లక్షల్లోపు రైతు రుణమాఫీ

కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:**

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు దక్కేది గుండుసున్నానే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఊరూరూ తిరిగి  కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకుంటామన్నారు. అధికారం కోల్పోయిన బాధ కేసీఆర్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్, కేటీఆర్‌ల బుద్ధి మారలేదన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కొట్ర చౌరస్తాలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. జైపాల్ రెడ్డికి పదవులతో గౌరవం రాలేదని.. ఆయన వల్లే పదవులకు గౌరవం వచ్చిందన్నారు.కాంగ్రెస్ అధిష్ఠానానికి ప్రత్యేక తెలంగాణ ప్రాధాన్యాన్ని  జైపాల్ రెడ్డి వివరించి ఒప్పించారని గుర్తు చేశారు. 2014లో జైపాల్ రెడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉండేదన్నారు. జులై 31 లోపే రెండో విడత రైతు రుణమాఫీ మిగతా2లో...

## మేడిగడ్డ కుంగింది మీవల్లే

- కేసీఆర్‌పై ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణ  రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- 94 వేల కోట్లు ఖర్చు చేసి 93 వేల ఎకరాలు సేద్యంలోకా?
- వాస్తవాలను వక్రీకరించడం గులాబీదండుకు వెన్నతో పెట్టిన విద్య
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శల



2

## బోనమెత్తిన భాగ్యనగరం

భాగ్యనగరంలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి సల్లంగ సూడమ్మ అంటూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలు, అమ్మవార్ల ఆలయాలకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరడంతో ఆలయాలు కిటకిటలాడాయి.



8

## భారత అథ్లెట్లకు మద్దతు ఇవ్వండి

### మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ పిలుపు

- గణిత ఒలింపియాడ్ 2024 విజేతలకు అభినందనలు
- చారాడ్డేవ్ మోదమ్ కు యునెస్కో గుర్తింపు రావడంపై  హర్షం



2

## ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీ జన్ సురాజ్



2

## రేవంత్ రెడ్డి, అక్బరుద్దీన్ అన్నదమ్ములయ్యారు

- దమ్ముంటే అక్బరుద్దీన్ కొడంగల్ నుంచి పోటీచేయాలి
- భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం
- హిందువుల తరపున పక్కా మాట్లాడుతా
- పాతబస్తీ వేదికగా బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** ఎంఐఎం పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేసారు. రాష్ట్రంలో ఎంఐఎం గోడమీది పిల్లిలాంటిదని, ఎవరు అధికారంలో ఉంటే వారి చెంతకు చేరుతుందని ఆరోపించారు. దమ్ముంటే అక్బరుద్దీన్ కొడంగల్ నుంచి పోటీచేయాలని, డిపాజిట్ కూడా రాకుండా చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ అన్నదమ్ములయ్యారన్నారు. భాగ్యలక్ష్మి ఆలయం గురించి బండి సంజయ్ అక్కడే కీలక ప్రకటన చేసారు.

మిగతా2లో...



## పదేళ్లుగా ప్రజాస్వామ్య విధ్వంసం



కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుంది

ప్రజా ఉద్యమాల ద్వారా ఏదైనా సాధించవచ్చు

**ది వైర్ సీనియర్ సంపాదకురాలు అర్ఫా ఖానుమ్ షెర్వాణి**

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను విధ్వంసం చేసి ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని ది వైర్ సీనియర్ సంపాదకురాలు అర్ఫా ఖానుమ్ షెర్వాణి అన్నారు. రచయితలు, ఉద్యమకారులు, మైనారిటీలపై అణచివేత ధోరణి అవలంబించిందని ఆమె ధ్వజమెత్తారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ విద్యా వంతుల వేదిక (టీవీవీ) మిగతా3లో...



మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 94 | ₹ 116 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 168 | ₹ 191 |



తమిళ రచయిత్రి శివశంకరికి

## విశ్వంభర పురస్కారం

- నేడు ప్రదానోత్సవం
- హాజరుకానున్నసీఎం రేవంత్ రెడ్డి

3

## కార్మికులను పట్టించుకోని కేంద్రబడ్జెట్

**త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం**

**బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం వెల్లడి**

**విశ్వంభర, సిద్దిపేట:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి తీవ్ర నిరాశే మిగిలిందని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. ఎన్నాళ్లుగానో ఉన్న సమస్యలకు ఈ బడ్జెట్ పరిష్కారం చూపుతుందని లక్షల మంది

మిగతా3లో...



## ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ విద్యార్థుల మృతి

**ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో జలసమాధి**




2

# దిల్లీలో ముగ్గురు సివిల్స్ విద్యార్థుల మృతి

**విశ్వంభర, దిల్లీ:** దేశ రాజధానిలో దిగ్భ్రాంతకర ఘటన చోటు చేసుకుంది. ఐఏఎస్ కావాలని కలలు గన్న ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు. స్టడీ సర్కిల్ భవనం బేస్‌మెంట్‌లో నీటిలో చిక్కుకుని జల సమాధి అయ్యారు. మృతుల్లో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. ఈ ఉదంతంపై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. విద్యార్థుల మృతిపై దిల్లీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు మంత్రి ఆతిషి ఓ ప్రకటన విడుదల చేశారు. మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పశ్చిమ ప్రాంతంలోని ఓల్డ్ రాజేంద్రనగర్ బాడా బజార్‌లో ఈ కోచింగ్ సెంటర్ ఉంది. ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్న వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇక్కడ చదువుకుంటుంటారు. నాలుగు అంతస్తుల భవనం ఇది. ఈ భవనం బేస్‌మెంట్‌లో లైబ్రరీ సహా కొందరు విద్యార్థులకు వసతి సౌకర్యం ఉంది. రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు ఈ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లో వరదనీరు పోటెత్తింది. ఆ సమయంలో పలువురు విద్యార్థులు లైబ్రరీలో ఉన్నారు. ఒక్కసారిగా నీరు బేస్‌మెంట్‌లోనికి ప్రవహించడంతో బయటికి వెళ్లే వీలు లేకుండాపోయింది. కొందరు విద్యార్థులు ప్రాణాలతో బయటపడగలిగారు. ముగ్గురు అక్కడే చిక్కుకుపోయారు. జలసమాధి అయ్యారు. వారిని తానియా సోని, శ్రేయా యాదవ్, నెవిన్ దాల్విన్‌గా గుర్తించారు.

**ఇది వ్యవస్థల వైఫల్యం: రాహుల్ గాంధీ**

విశ్వంభర, దిల్లీ: పేలవమైన భవన నిర్మాణ ప్రణాళిక, భద్రతలేని నిర్మాణం, ప్రభుత్వ సంస్థల బాధ్యతారాహిత్యానికి సామాన్య ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని లోక్‌సభలోప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దిల్లీలో భారీ వర్షాల కారణంగా సివిల్స్ శిక్షణా కేంద్రంలోకి వరద పోటెత్తి ముగ్గురు అభ్యర్థులు మృతిచెందిన విషయం తెలిసిందే.మృతుల కుటుంబాల పట్ల రాహుల్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపర్చారు. బేస్మెంట్లో నీరు చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మృతిచెందడం చాలా దురదృష్టకరమన్నారు.. కొద్దిరోజుల క్రితం వర్షాలకు విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందాడని, మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాన్నారు. ఈఘటన వ్యవస్థల సంయుక్త వైఫల్యమని విమర్శించారు. పేలవమైన భవన నిర్మాణ ప్రణాళిక, సంస్థల బాధ్యతారాహిత్యం వల్ల సామాన్య పౌరులు తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు సురక్షితమైన, సౌకర్యవంతమైన జీవితం ప్రతీ పౌరుడి హక్కని, దాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత అని రాహుల్ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# టీపీసీసీ అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా నంగి దేవేందర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ప్రవాస భారతీయ విభాగంలో అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా ప్రముఖ ఎన్నారై నంగి దేవేందర్ రెడ్డి నియమితులయ్యారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లకు దేవేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యరాజ్య సమితిలో 193 సభ్య దేశాలు ఉన్నాయి. వందకు పైగా దేశాలకు ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య కోసం తెలంగాణ వాసులు వలస వెళ్లారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులను మాతృభూమి తెలంగాణతో అనుసంధానం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన కృషి చేస్తానని నంగి దేవేందర్ రెడ్డి అన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సహకరించట్లేదు

**ఎన్టీపీసీ థర్మల్ ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఎన్టీపీసీ థర్మల్ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో సహకరించడంలేదని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్టీపీసీ రాస్తున్న లేఖలపై తక్షణమే ప్రభుత్వం స్పందించి, పీపీఏ చేసుకుంటే అది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడినట్లు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రజలకు వీలైనంత ఎక్కువ విద్యుత్‌ను అందుబాటులో ఉంచాలనుకున్న కేంద్ర ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని. కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండంలో 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే ప్రాజెక్టునకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతగా 800 మెగావాట్ల సామర్థ్యం గల 2 పవర్ ప్లాంట్లను ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆయన తెలిపారు.

**విద్యుత్ భద్రతపై దృష్టి :** రూ.10,598.98 కోట్లతో చేపట్టిన ఈ రెండు పవర్ ప్రాజెక్టుల్లో మొదటి 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 3 అక్టోబర్ 2023న, రెండో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 4 మార్చి 2024న ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ 4వేల మెగావాట్ల ప్రాజెక్టులో మిగిలిన 2,400 మెగావాట్ల ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా ప్రారంభించుకుని, రాష్ట్రంలో విద్యుత్ భద్రత కల్పించాలని కేంద్రం భావిస్తోందన్నారు. విద్యుత్ ఉత్పత్తికి ఎన్టీపీసీతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు. దీని తర్వాతే ప్లాంట్ల ఏర్పాటుకు, తగినంత బొగ్గు అందుబాటులో ఉంచుకోవడం మొదలైన అంశాలపై ఎన్టీపీసీ పని ప్రారంభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఎన్టీపీసీ-II ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసి విద్యుదుత్పత్తి పెంచాలనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచనని తెలిపారు.

**స్పందన కరవు :** దీనికి అనుగుణంగానే పీపీఏ విషయంలో త్వరగా స్పందించి సహకరించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి 4సార్లు లేఖలు రాసినా స్పందన రాలేదన్నారు. గత ఏడాది అక్టోబర్ 5న, ఈ ఏడాది జనవరి 9న, జనవరి 29న ఆ తర్వాత మొన్న ఏప్రిల్ 29న లేఖలు రాస్తే వీటికి టీఎస్ ట్రాన్స్‌కో నుంచి సమాధానం లభించలేదని తెలిపారు. ఇన్నిసార్లు లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ కొనుగోలు చేసే ఆసక్తి లేదన్నట్లుగానే భావించాల్సి వస్తుందని ఎన్టీపీసీ లేఖలో పేర్కొందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి ఆసక్తి లేని పక్షంలో, దీన్ని దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు విక్రయించేందుకు అనుమతి ఉంటుందని ఎన్టీపీసీ రాసిన లేఖలు స్పష్టం చేస్తున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై తొలి హక్కు తెలంగాణ ప్రజలదే అని, కేంద్రం అన్నిరకాలుగా సహకరిస్తున్నా, దీన్ని అందుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమవుతోందని మరోసారి నిరూపితమైందన్నారు.

# మేడిగడ్డ కుంగింది మీవల్లే



**విశ్వంభర, హైదరాబాద్:** మేడిగడ్డ కుంగింది ముమ్మాటికీ రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ కారణంగానేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. అంతటి నిర్వాకం జరిగింది మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ వల్లేనని ఆయన అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ స్వయంగా డిజైన్ చేసింది అంటూ గులాబీ దండు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న విషయాన్ని ఆయన ఈ సందర్భం గుర్తుచేశారు. మేడిగడ్డ కు ఎందుకు నీళ్లు పంపింగ్ చెయ్యడం లేదంటూ మాజీ మంత్రి కేటీఆర్ మీడియా తో మాట్లాడిన అంశంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కట్టినప్పుడు, కూలి నప్పుడు అధికారంలో ఉన్నది మీరే అయినప్పుడు ఆ నెపం మరొకరి మీదకు నెట్టడం మీ విజ్ఞత కే వదిలి పెడుతున్నామన్నారు.మేడిగడ్డ బ్యారేజ్ కూలిన 47 రోజులకు తాము అధికారంలోకి విషయాన్ని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు.మరి ఆ 47 రోజులు అధికారంలో ఉన్న మీరు ఏం చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీటి పారుదల రంగాన్ని సర్వనాశనం చేసి, భ్రష్టు పట్టించిన ఘనత పదేళ్లు అధికారం వెలగబెట్టిన బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని విమర్శించారు. వాస్తావాలను వక్రీకరించడం కేసీఆర్ కు కేటీఆర్ కు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. అందులో భాగమే కేటిఆర్ వ్యాఖ్యలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా గ్లోబల్ ప్రచారం ఆపాలని కేటీఆర్ కు ఆయన హితవుపలికారు.

కాళేశ్వరం కు మేడిగడ్డ గుండె కాయ అని ప్రగల్బాలు పలికింది మీరే అని, అటువంటి మేడిగడ్డ కుంగినప్పుడు తీసుకున్న చర్యలు ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.94 వేల కోట్లు ప్రజాధనాన్ని వినియోగించి 93 వేల ఎకరాలను కుడా సేద్యం లోకి తీసుకరాకపోవడమే మీరు చెప్పిన రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ గొప్పతనమా అని ఆయన ఎత్తి పొడిచారు. బ్యారేజ్ ల నిర్మాణం సమయంలో సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి ఎందుకు తీసుకోలేదో ఆయన వివరించాలన్నారు.జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ దేశంలోనే అత్యున్నత సభ అయిన పార్లమెంట్ లో తీసుకొచ్చిన చట్టం ద్వారా ఏర్పడిందన్నారు.దేశంలోని డ్యామ్ లను బ్యారేజ్ ల నైపుణ్యాలను ఈ సంస్థ లోని నిపుణులు పరిశీలిస్తారని ఆయన తెలిపారు.యావత్ భారత దేశంలోనే పేరొందిన నిపుణులు అందులో ప్రతినిధులుగా ఉంటారని ఆయన తెలిపారు. అటువంటి నిపుణులు సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ లు గేట్లు తెరచి పెట్టడం జరిగిందన్నారు.అటువంటి నిపుణులతో రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన ఎన్‌డీఎస్‌ఏ ను అవమానకరంగా మాట్లాడం కేటీఆర్ కే చెల్లిందన్నారు.

తాము అధికారంలోకి రాక ముందే కుంగుబాటుకు పూర్ డిజైనింగ్, పూర్ కనస్ట్రక్షన్ ,పూర్ ఆపరేషన్ మెయింటేనెన్స్ అంటూ న్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికను మర్చిపోయారా అంటూ ఆయన నిలదీశారు. మేడిగడ్డ కు నీళ్లు పంపింగ్ చేసిన పక్షంలో జరగ బోయే ప్రమాదం తలుచుకుంటేనే ఒళ్ళు గగుర్పాటుకు గురి చేస్తుందన్నారు. జరగ బోయే ఆస్తి నష్టం,ప్రాణ నష్టం అంతా ఇంతా అని చెప్పలేమన్నారు.నిజంగా ఎన్‌డీఎస్‌ఏసూచనలను కాదని రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ సృష్టికర్తలు చెప్పినట్లు చేస్తే ఇప్పటికే పూర్తి అయిన సమ్మక్క-సారక్క కొట్టుకు పోవడం తో పాటు సీతారాం ప్రాజెక్ట్ దెబ్బతింటుందన్నారు. అంతటితో ఆగకుండా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉన్న భద్రాచలం పట్టణంతో పాటు 44 గ్రామాలు ముంపుకు గురౌతాయన్నారు.ఈ ప్రభుత్వానికి ఎటువంటి దురాలోచన లేదని, ఉన్నదల్లా దూరాలోచననే ఆయన పేర్కొన్నారు. ఆ దురుద్దేశాలు ఏవో మీకు ఉన్నందునే నిపుణులు చెప్పిన విషయాన్నికాదని పంపింగ్ డిమాండ్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుందని ఆయన ఆరోపించారు.

మెడిగడ్డ,సుందిళ్ళ,అన్నారం లను ఏ విదంగా వినియోగం లోకి తేవాలి అన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర క్యాబినెట్ సంకల్పమన్నారు. ఇది ముమ్మాటికీ తెలంగాణా ప్రజల సొత్తు అని ఆ ప్రజలను తాకట్టు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ లని అటువంటివి కాపాడుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.నాన్ బ్యాంకింగ్ కార్పోరేషన్ ల నుండి అధిక వడ్డీలతో అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రజలపై పెను భారం మోపిన చరిత్ర మీదన్నారు . ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయితే అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సింది25,000 వేల కోట్లు కాగా ఇప్పటికే 15,000 కోట్లు చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కుడా ఇంతటి అధిక వడ్డీలకు అప్పులు చేసిన సందర్భం లేదన్నారు. మీ లాగా అబద్దాలు ఆడడం,అబద్ధాన్ని నిజంగా నమ్మించడం మాకు చేత కాదని ఆయన కేటీఆర్ ను ఎత్తి పొడిచారు. అటువంటి అబద్దాలతోటే కదా 38,000 కోట్లతో పూర్తి అయ్యే డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ చేవెళ్ల-ప్రాణహిత ను రద్దు చేసిందని ఆయన ఆరోపించారు. అదే పూర్తి అయి ఉండి ఉంటే ఇప్పటికే16.4 లక్షల ఎకరాల నుండి 18.25 లక్షల ఎకరాల వరకు సేద్యం లోకి వచ్చి ఉండేదన్నారు విద్యుత్ బిల్లుల కోసం పంపింగ్ నిలుపుదల అంటూ కేటీఆర్ చేసిన ఆరోపణలను ఆయన తిప్పి కొట్టారు .మీరు చేసిన రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ తోటి పదివేల కోట్లవిద్యుత్ బిల్లులు అదనపు భారంగా పరణమించాయని మాత్రమే తాము చెప్పామన్నారు. అదే చేవెళ్ల-ప్రాణహిత పూర్తి అయి ఉంటే కేవలం 1000 కోట్ల విద్యుత్ ఖర్చుతో బయట పడే వారం కదా అని ఆయన పేర్కొన్నారు. తుమ్మడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం వద్దు అని సి డబ్ల్యూ సి చెప్పునట్లు బి ఆర్ ఎస్ చేస్తున్న వాదనలో నిజం లేదన్నారు. మేడిగడ్డ బ్యారెజ్ కుంగుబాటు పై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని,దోషులు ఎంతటి వారైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నానే

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరో మూడు రోజుల్లో ముచ్చెర్లలో స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తామని సీఎం చెప్పారు.

**ఆగస్టులోపు రుణమాఫీ**

రుణమాఫీ చేసి చూపించాలని బీఆర్ఎస్ నేతలు సవాల్ విసిరారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఆగస్టులోపే రుణమాఫీ చేస్తామని, జులై 31లోపే రూ.1.50 లక్షల్లోపు రైతు రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు ఆఖరుకల్లా రూ.2 లక్షల్లోపు రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు కష్టాలు వచ్చాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, పేదలకు ఎవరికీ కష్టాలు రాలేదని, కేసీఆర్ కుటుంబానికి కష్టాలు వచ్చాయని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. అధికారం పోయిందనే బాధ కేసీఆర్‌లో స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజలు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించారని పేర్కొన్నారు కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం కల్వకుర్తిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, రహదారుల కోసం రూ. 180 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ఆమన్‌గల్‌కు డిగ్రీ కాలేజీ మంజూరు చేస్తామని తెలిపారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు హైదరాబాద్ కు నాలుగు లేన్ల రహదారి తెస్తామని, దీనిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ఇప్పటికే మాట్లాడామని సీఎం చెప్పారు. తాను చదువుకున్న తాండ్ర హైస్కూల్ అభివృద్ధికి రూ. 5 కోట్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మాడుగుల మండల కేంద్రంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. తాను ఎంత ఎదిగినా నల్లమల బిడ్డనే అని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.

**జైపాల్‌రెడ్డి పాలమూరు బిడ్డ కావడం మన అదృష్టం**

జైపాల్ రెడ్డి కేవలం నమ్మిన సిద్ధాంతం కొరకు పనిచేసేవారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఐదుసార్లు లోక్‌సభలో సభ్యునిగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యునిగా పనిచేసే పార్లమెంటు ఉభయసభల్లో తనదైన శైలి లో ప్రజా సమస్యలపై గళమెత్తారన్నారు.. అలాంటి నాయకుడు తెలంగాణ వాడు.. అదీ పాలమూరు జిల్లాకు చెందిన వాడై నందుకు మనం అదృష్టవంతులమని అన్నారు. నేను పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని అంటూ కల్వకుర్తి నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సరిత తిరుపతయ్య రాజేష్ రెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి, అక్బరుద్దీన్ అన్నదమ్ములయ్యారు

(మొదటి పేజీ తరువాయి)



బండి సంజయ్ పూజలు పాతబస్తి లాల్‌దర్వాజ బోనాల సందర్భంగా చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో బోనాలను అడ్డుకుంటున్నారని, ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూడాలన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరూ ఆనందంగా ఉండాలని కోరుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రాగానే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని తెలిపారు. తాను హిందువుల తరపున పక్కా మాట్లాడుతానని, అయితే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.బోనాల ఏర్పాట్లపై తన అసంతృప్తిని తెలిపారు. ఈ సందర్భంగా ఆ అమ్మవారిని సందర్శించి మొక్కుకుంటే మన కష్టాలన్నీ తొలగిపోతాయని..మహిమాన్వితమైన శక్తికి కలిగివున్న తల్లి అని..బోనాలలో ముక్కులు తీర్చుకుంటే మళ్లీ వచ్చే ఏడాది దాకా కష్టాలు మన దరిచేరవని అన్నారు. పాతబస్తీలో కొన్ని ప్రాంతాలలో బోనాలను అడ్డుకుంటున్నారని..దీని వెనక ఉన్న రాజకీయ శక్తులేమిటో తనకి తెలుసని అన్నారు. వాళ్లకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. అక్బరుద్దీన్ తన బలమేమిటో తెలియకుండా మాట్లాడుతున్నారని అన్నారు. అధికారంలోకి ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వానికి మద్దతు నిచ్చే పార్టీ ఎంఐఎం అన్నారు. ఎంఐఎం ఉండగా పాత బస్తీ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోదని అన్నారు. రేవంత్ సర్కార్ బోనాల ఏర్పాట్ల కోసం కేవలం రూ.5 లక్షలు మాత్రమే నిధులు విదిల్చిందని అదే పాతబస్తీలో జరుపుకునే రంజాన్ పండుగకు మాత్రం రూ.33 కోట్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. హిందూ, ముస్లిం పండుగల పేరుతో సీఎం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారం లోకి వస్తే భాగ్యలక్ష్మి ఆలయాన్ని బంగారు ఆలయంగా మారుస్తామని బండి హామీ ఇచ్చారు.

# భారత అథ్లెట్లకు మద్దతు ఇవ్వండి

- మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ పిలుపు
- గణిత ఒలింపియాడ్ 2024 విజేతలకు అభినందనలు
- చారాడ్దేవ్ మోదమ్ కు యునెస్కో గుర్తింపు రావడంపై హర్షం
- వారసత్వ సంపదను ముందుకు తీసుకెళితే అభివృద్ధి సాధిస్తుందన్నప్రధాని



**విశ్వంభర, ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్ లో బరిలోకి దిగుతున్న భారత అథ్లెట్లకు దేశం మొత్తం మద్ధతుగా ఉండాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం 112వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం ఎదుట భారత పతాకాన్ని రెపరెపలాడించే అరుదైన అవకాశం వారికి ఉందని.. మనం వారిని కచ్చితంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పలు అంశాలను ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. యూకేలో జరిగిన అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ 2024లో పాల్గొని పతకాలు సాధించిన జట్టును ప్రధాని అభినందించారు. ఇటీవల గణిత ఒలింపిక్స్ కూడా జరిగాయని.. దాదాపు 100 దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో మనవాళ్లు అద్భుత విజయం సాధించారన్నారు. ఈ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు దక్కించుకొన్న విషయం తెలిసిందే.

అస్సాంలోని చారాడ్దేవ్ మోదమ్ కు యునెస్కో వారసత్వ క్షేత్రంగా గుర్తింపు రావడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఈ గౌరవం దక్కించుకున్న 43వ ప్రదేశమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రదేశాన్ని సందర్శించాలన్నారు. ఏ దేశమైనా తమ వారసత్వ సంపదను ముందుకు తీసుకెళితే అభివృద్ధి సాధిస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చేసిన ప్రయత్నమే ప్రాజెక్టు పరి అని పేర్కొన్నారు. భారత్ మండపంలో కళాకృతుల్లో దేశ సంస్కృతి ఉట్టిపడుతోందన్నారు. తహర్యానాలో రోహ్తక్లో 250మంది మహిళలు బ్లాక్ పెయింటింగ్, డయింగ్లో శిక్షణ పొంది జీవితాలను మార్చేసుకున్నారని ప్రధాని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఖద్దర్ విక్రయాలు 400 రెట్లు పెరిగి తొలిసారి రూ.1.5లక్షల కోట్లను దాటాయన్నారు.

## ఏపీ మంత్రికి తప్పిన ప్రమాదం

# స్వల్పగాయాలు

**విశ్వంభర, టంగుటూరు:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి పెను ప్రమాదం తప్పింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ కొలుపులకు ఆదివారం మంత్రి, పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు ఉంచిన ఎడ్లబండ్ల ముందు స్థానిక నాయకులు, యువత.. మంత్రితో ఫోటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో డీజే సౌండ్ కు ఎద్దులు ఒక్కసారిగా బెదిరి మంత్రిని తలతో ముందుకు నెట్టాయి. దీంతో ముందుకు బోర్లాపడిన మంత్రి ఎద్దు ముందుకాళ్లతో బలంగా తొక్కింది. వెంటనే అప్రమత్తమైన గన్మెన్లు, పార్టీ నాయకులు ఎడ్లను అడ్డుకొని మంత్రిని ప్రమాదం నుంచి తప్పించారు. ఘటన తర్వాత టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని నివాసానికి చేరుకొన్న మంత్రికి వైద్యులు చికిత్స అందించారు. విషయం తెలిసిన నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రావు మంత్రి నివాసానికి వచ్చి పరామర్శించగా.. పలువురు నేతలు చరవాణి ద్వారా ఘటన వివరాలను తెలుసుకొని పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.

# సీయూఈటీ ఫలితాల విడుదల



**దిల్లీ:** దేశవ్యాప్తంగా యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ అండర్‌గ్రాడ్యుయేట్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం ప్రకటించింది. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్https://exams.nta.ac.in/CUET-UG సంప్రదించాలని సూచించింది. సీయూఈటీ యూజీ-2024 పరీక్షలు మే 15, 16, 17, 18, 21, 22, 24, 29 తేదీల్లో తేదీల్లో జరిగిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా 379 నగరాలు, విదేశాల్లోని 26 నగరాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 13.48 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు.దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు, ప్రముఖ విద్యాసంస్థల్లో 2024 సంవత్సరానికి గాను సాధారణ యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 నిర్వహించారు. వాస్తవానికి సీయూఈటీ ఫలితాలు జూన్ 30వ తేదీన విడుదల కావాల్సి ఉండగా.. అనుకోని కారణాల కారణంగా ఆలస్యం జరిగింది. నీట్, నెట్ పరీక్షల వ్యవహారం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగింది. దీంతో పరీక్షలకు హాజరైన విద్యార్థులంతా ఫలితాల కోసం నిరీక్షిస్తూ వచ్చారు.

# ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీ జన్ సురాజ్

**పాట్నా:** ఎన్నికల మాజీ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయ పార్టీ ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీహార్ లో రెండేళ్ల కిందట ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పేరిట పాదయాత్ర ప్రారంభించారు. ఇప్పుడా పేరుతోనే రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ప్రశాంత్ కిశోర్ ఆదివారం వెల్లడించారు. తాను ప్రారంభించబోయే కొత్త పార్టీని అక్టోబరు 2 గాంధీ జయంతి నాడు ప్రకటిస్తానని తెలిపారు. అంతేకాదు, వచ్చే ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని చెప్పారు. పార్టీ నాయకత్వం, పార్టీ కార్యవర్గం వంటి వివరాలను తర్వాత వెల్లడిస్తామని చెప్పారు. ప్రశాంత్ కిశోర్ గతంలో రాజకీయ వ్యూహకర్తగా పలు పార్టీల విజయాల్లో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లోకి వచ్చి జేడీయూ పార్టీలో చేరారు. జేడీయూ జాతీయ ఉపాధ్యక్ష పదవిని కూడా చేపట్టిన ఆయన... ఆ తర్వాత కొన్ని పరిణామాల నేపథ్యంలో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అప్పటినుంచి జేడీయూ నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ పై వీలు చిక్కినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

# తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ పై కేసు నమోదు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. 75 కంపెనీలు అవకతవకలకు పాల్పడినట్లు ఫోరెన్సిక్ ఆడిట్ వెల్లడించింది.కమర్షియల్ టాక్స్ కమిషనర్ రవి ఫిర్యాదుతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తోపాటు పలువురిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. కమర్షియల్ టాక్స్ అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లపై కేసు నమోదైంది. నిందితులపై 406, 409, 120(బీ) చట్టం కింద సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఈఎస్ఐ నిధులను వాడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

- కార్మికులకు తీవ్ర అన్యాయం
- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్



**విశ్వంభర, సిద్దిపేట:** భారతీయ మజ్దూర్ సంఘ్ ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అయిదు డిస్పెన్సరీలు మంజూరు చేస్తే గత ప్రభుత్వం అమలు కాకుండా చేసిందని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ ఆరోపించారు. సిద్దిపేటలో బీఎంఎస్ చింతన్ బైఠక్ అనంతరం ఆయన మాట్లాడారు. కేవలం కేంద్రానికి పేరొస్తుందని కార్మికులను వైద్యానికి దూరం చేసిన దుర్మార్గ ప్రభుత్వమని అన్నారు. తెలంగాణలో లక్షలాది కార్మికులు వైద్యం, పిల్లలకు విద్య లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్మికులకు ఈఎస్ఐ సేవలు ఇబ్బందికరంగా ఉన్నాయని అన్నారు. ఈఎస్ఐ నిధులను ప్రభుత్వం వాడుకుంటోందని ఆరోపించారు. ఒక ఐపీకి కేంద్రం రూ.3000 చొప్పున రూ.300 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఖజానాకు మళ్లించుకుంటూ కార్మికులను మోసం చేస్తోందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలలో కార్మికులపై చర్చించేలా , ప్రభుత్వం కళ్లు తెరిపించే విధంగా..రాజకీయాలకు అతీతంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమకార్యాచరణ చేపట్టబోతున్నామని ఆయన వెల్లడించారు.

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ పాతబస్తీలోని లాల్ ధర్వాజ నల్లపోచమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లాల్ ధర్వాజ మేకలబండలో కొలువైన నల్లపోచమ్మ బోనాల జాతర సందర్భంగా ఆదివారం ఆయన అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు బోనాల జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు పొన్న వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గోల్కొండ నవీన్, మున్నూరుకాపు ప్రముఖులు తూడి ప్రవీణ్, మీసాల చంద్రయ్యలు సాదర స్వాగతం పలికారు. ఎంపీ వద్దిరాజు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించి, పూలమాల, శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట గాయత్రి గ్రానైట్స్ కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.





# కన్నుల పండువగా ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ముగింపు

## మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్:** ఫోటో ట్రేడ్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మరియు ఫోటో టెక్ సంయుక్తంగా నిర్వహించిన ఎల్బీనగర్‌లో కేబీఆర్ కన్వెన్షన్ లో నిర్వహించిన ఫోటో ట్రేడ్ ఎక్స్పోజింగ్‌కు ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి ఎక్స్పో తెలంగాణ రాష్ట్రంలో జరగడం చాలా అద్భుతం ఎప్పటికప్పుడు టెక్నాలజీ పెరుగుతున్నందువలన ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. స్టాల్స్‌ను సందర్శించి మంచి కెమెరాలు ఆల్బమ్స్ అన్ని రకాల కెమెరాలకు సంబంధించిన వస్తువులు ఒకే వేదికలపై దొరకడం చాలా అభినందనీయం అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ముఖ్యభూమిక పోషించారని అన్నారు. ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వీ3 న్యూస్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త, న్యూ డెమోక్రసి నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మునగాల శైలేందర్, వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ రెడ్డి, జంగారెడ్డి, కిషన్ గుప్త, శలేందర్, జగదీశ్ గౌడ్, నాగరాజు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కుట్లలాలు, నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, యాదాద్రి జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి, ఫోటోటెక్ సీఈవో అభిమన్యు రెడ్డి, భూపాల్ కుమార్, ఓం ప్రకాష్, జూలూరు మధు, ఫోటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులను పట్టించుకోని కేంద్రబడ్జెట్

- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం వెల్లడి



(మొదటి పేజీ తరువాయి)

కార్మికులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూశారని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేటలో బీఎంఎస్ రాష్ట్ర కమిటీ చింతన్ బైఠక్ అనంతరం ఆయన మాట్లాడారు. ఆగస్టు 15, 16,17 తేదీల్లో ముంబయిలో జరిగే బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో వీటిపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ముఖ్యంగా కొత్త పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు చాలా కాలంగా కోరుతున్నా ప్రభుత్వం తన వైఖరిని ప్రకటించలేదని ఆయన అన్నారు. 8వ పే కమిషన్ గురించి ప్రతిపాదన వస్తుందని ఆశించినా ప్రకటన రాలేదన్నారు. వేతన జీవులకు ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు పరిధి విషయంలోనూ పెద్దగా ఊరట రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు లక్షల రూపాయల వరకు ఆదాయానికి అయిదు శాతం మోయలేని భారమే అన్నారు. అలాగే గ్రాట్యుటీ సీలింగ్ పరిధిని కూడా రూ.20 లక్షల నుంచి కోరినా ఫలితం దక్కలేదన్నారు. ఔట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఖాళీల భర్తీ విషయంలోనూ స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం సాధించిన అనే విజయాల్లో భాగస్వాములైన కార్మికుల ఆశలను ఈ బడ్జెట్ నెరవేర్చలేదన్నారు. పీ ఎఫ్ పరిమితిని రూ 15000లకు పెంచి పదేళ్లు పూర్తయిందని తెలిపారు. దీనిని ఆ రూ.30 వేలకు పెంచాలని కోరుతున్నామన్నారు. అలాగే కనీస పింఛన్‌ను రూ.1000 నుంచి రూ. 5000లకు పెంచి కరవు భత్యాన్ని జోడించాల్సిన అవసరముందన్నారు. పెన్షన్ స్కీం, మెడికల్ స్కీం వర్తింపజేయాల్సి ఉందన్నారు. ఈపీఎఫ్‌లో సభ్యులు గాఉన్న 75 లక్షల మంది కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఈఎస్ఐ పరిమితిని కూడా రూ.21 వేల నుంచి రెట్టింపు చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులు కూడా పీఎఫ్, ఈఎస్ఐల పరిధి నుంచి దూరం జరగాల్సిన పరిస్థితిని గమనించాలన్నారు. ఈ విషయాలపై సీబీటీ, ఈపీఎఫ్ఓ బోర్డు సమావేశాల్లో బీఎంఎస్ ప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. అయినా బడ్జెట్‌లో ఊరట దక్కకపోవడంతో బీఎంఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో జాతీయ కార్యవర్గ సమావేశాల్లో లోతుగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మల్లేశం తెలిపారు.

### రాష్ట్ర బడ్జెట్‌లోనూ అన్యాయమే

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనూ కార్మికులకు అన్యాయమే జరిగిందని మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోకనీస వేతనాల సవరించలేదన్నారు. గత పదేళ్లుగా లక్షలాది మంది రూ.12, 13 వేల వేతనంతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ రోజుల్లో ఈ జీవితంతో బతకడం అసాధ్యమని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం వెంటనే ఈవిషయంలో దృష్టి సారించి , కేంద్ర ప్రభుత్వం సవరించినట్లుగా 21 వేల కు పైనే ఇవ్వాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం కన్‌స్ట్రక్షన్ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించిందన్నారు. దీంతో లక్షలాది మంది కన్‌స్ట్రక్షన్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. దీనిపైనా ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించి తీసుకున్న నిధులను బోర్డుకు ఇవ్వాలని కోరారు. అలాగే బోర్డును పునర్వ్యవస్థీకరించాలని మల్లేశం కోరారు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ప్రభుత్వాలు కార్మికులకు అనుకూలంగా కాకుండా వ్యతిరేకంగానే ఆలోచిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్నింటిపై సిద్దిపేటలో జరిగిన సమావేశాల్లో చర్చించామన్నారు.

# తమిళ రచయిత్రి శివశంకరికి విశ్వంభర పురస్కారం



**విశ్వంభర, హైదరాబాద్:** పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా సుశీలా నారాయణ రెడ్డి ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో విశ్వంభర (డా.సి.నారాయణ రెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం) ప్రదానోత్సవం సోమవారం రవీంద్ర భారతిలో జరుగుతుందని ట్రస్టు ప్రధాన కార్యదర్శి డా.చెన్నయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని ప్రముఖ తమిళ రచయిత్రి సరస్వతి సమ్మాన పురస్కార గ్రహీత శివశంకరికి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ పురస్కార ప్రధానోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డా.చెన్నయ్య కోరారు.

## రిజర్వాయర్‌ను పరిశీలించిన తహసిల్దార్

**విశ్వంభర, కమాన్ పూర్:** కమాన్ పూర్ మండలం గుండారం రిజర్వాయర్‌ను తహసిల్దార్ ఆరిపోద్దిన్ పరిశీలించారు. గత వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్ లోకి వర్షపు నీరు భారీగా చేరుతోంది. గుండారం రిజర్వాయర్‌లోకి గౌరీ గుండం ద్వారా పెద్ద ఎత్తున వరద చేరడంతో 12 అడుగుల కెపాసిటీ ఉన్న రిజర్వాయర్ ఈపాటికి నిండుకుండలా కళకళలాడుతోంది. అలాగే భారీగా నీరు చేరడంతో మత్తడి ద్వారా నీరు మండల వాగు చౌటవాగు ద్వారా మంథని గోదావరిలోకి చేరుతోంది. రిజర్వాయర్ నిండిపోవడంతో తహసిల్దార్ ఆర్ఎస్‌బి గేట్లను పరిశీలించారు . అలాగే కరకట్ట తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట గిర్ధవార్ గౌతమ్ తదితరులు ఉన్నారు.



# పదేళ్ళుగా ప్రజాస్వామ్య విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య అధ్యక్షత జరిగిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారకోపన్యాసం సందర్భంగా 'సమకాలిన భారతీయ సమాజం-ముందున్న సవాళ్లు అనే అంశంపై ఆమె ప్రసంగించారు. 2019 నుంచి 2024 వరకు కేంద్రంలో పాలన ఒక సర్కస్ లా కొనసాగిందని, ఇది అత్యంత దారుణమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తొలుత తనకు తానుగా సమతా ధర్మ పరిరక్షకుడిగా, నూతన హిందూ రాజ్య చక్రవర్తిగా ఉహించుకున్నారని ఆమె ఆరోపించారు. గడిచిన ఎన్నికల సందర్భంగా మోదీ బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, ఆదివాసీ వర్గాలపై విషం చిమ్ముతూ ప్రచారం కొనసాగించారని, 400 సీట్లు సాధించాలని పదేపదే ప్రజలకు విజ్ఞప్తి చేశారని ఆమె ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు గుత్తాధిపత్యానికి, మత తత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం ఇబ్బందికరమైనదని, ఎంతటి కష్టమైనా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుంటామని గత ఎన్నికల్లో రుజువు చేశారని ఆమె తెలిపారు. నియతృత్వ అరాచకానికి ఒక హద్దు ఉంటుందని, దానికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని ఆమె అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల పాత్రలో తేడా లేనప్పటికీ ప్రజాస్వామ్యం పట్ల ఒక కిటికి లాంటి ఆశ చిగురించిందన్నారు. త్వరలో ఈ కిటికీ తలుపుగా మారగలదన్న అశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం పట్ల నమ్మకాన్ని అశను కలిగించి వివిధ వర్గాలకు స్వేచ్ఛ కలిగించేందుకు ఒక మహిళగా తాను కృషి చేస్తుంటే గత పదేళ్ళ కాలంలో ఎన్నో ఇబ్బందులు, వేధింపులకు గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో వేదిక ప్రధాన కార్యదర్శి తిప్పర్తి యాదయ్య, ఉపాధ్యక్షులు రమాదేవి, కొండా నాగేశ్వర్ రావు, మానవహక్కుల వేదిక





చైర్మన్ జీవన్ కుమార్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, విశ్వంభర దినపత్రిక ఎడిటర్ కాచం సత్యనారాయణ, తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీయల్, టీఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్, తెజస నాయకులు పల్లె వినయ్, టీటీఎఫ్ అధ్యక్షుడు కె.ప్రభాకర్, చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# విశ్వంభర నాథుడు.. తెలుగు సాహితీ మేరునగధీరుడు

## నేడు సినారె జయంతి



ఆధునిక తెలుగు సాహిత్యంలో మేరునగధీరుడు... నిత్య సాహిత్య కృషీవలుడు.. 'విశ్వంభర' కావ్య సృష్టికర్త జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతీ అక్షరం అజరామరం. పద్యం, గేయం, వచనం, గజల్, పాట, బుర్రకథ, ప్రపంచపదులు వంటి సాహిత్య ప్రక్రియ ఏదైనా.. ఆ రచన ఆణిముత్యమే! 'సినారె సాహిత్యం సాగర సదృశం' అంటారు ఓ సందర్భంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు సారస్వత జయ కేతనం, ప్రముఖ సాహితీ యోధుడు సింగిరెడ్డి నారాయణ రెడ్డి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా వారి జీవితం, సాహితీ ప్రస్థానంలోని కొన్ని విశేషాలతో విశ్వంభర కథనం...

డా. సి. నారాయణరెడ్డి అవిభక్త కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజిపేట గ్రామంలో కర్షక కుటుంబంలో (గురుపూర్ణిమ)నాడు 29.7.1931 నాడు జన్మించారు. తల్లి బుచ్చమ్మ, తండ్రి మల్లారెడ్డి. నారాయణరెడ్డి ఇంటిపేరు సింగిరెడ్డి. దేవుని మొక్కు వల్ల కొడుకు పుట్టాడని, సత్య నారాయణరెడ్డి అని పేరు పెట్టుకున్నారు. అయితే సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో కొడుకును చేర్పించే సమయాన 'సి.నారాయణరెడ్డి' – అని నమోదు చేయించడం చేత, అదే పేరు స్థిర పడింది. హనుమాజిపేటలో ఆనాడు ప్రభుత్వ పాఠశాల లేనందువల్ల, వ్యక్తిగతంగా ఒక ఉపాధ్యాయుడు నడిపిన వీధి బడిలో ఆయన చదువుకు శ్రీకారం చుట్టి, ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశారు. తరువాత సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో తెలుగును ఒక ఐచ్ఛిక విషయంగా గ్రహించి, మాధ్యమిక స్థాయి విద్యను అభ్యసించారు. 1948లో కరీంనగర్ లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. సినారెలో సహజంగా సృజనాత్మకశక్తి, లయాత్మకత, చిన్ననాటి నుండే ఉన్నాయి. చిన్నప్పటి నుండి మట్టిలో పుట్టిన జానపదగీతాలను ఆలపించే వారు. హరికథలు, బుర్రకథలంటే చెవి కోసుకునేవారు. హరికథా కథనాన్ని ఆశువుగా, సంగీతాత్మకంగా అనుకరించేవారు. వేములవాడ వాస్తవ్యులు చౌటి నరసయ్య హరికథాగానం ఆయనకు ఛందస్సు పట్ల మక్కువ, అభిరుచి కలగడానికి ప్రేరకమైంది. ఆరేడు తరగతుల నుండే కవితలు వ్రాయడం మొదలు పెట్టారు. ఛందస్సంటే తెలియని దశ అది. ఏడవ తరగతిలో సీస పద్యమని తెలియని దశలో "ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో పొట్ట కోసర మెటో పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం వ్రాస్తే – అది సీసపద్యమని తెలిసి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను తెలిపారు దూపాటి వేంకట రమణాచార్యులు. తొమ్మిదవ తరగతి చదువు తున్నప్పుడు వ్రాసిన..."మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో"

అనేది సినారె తొలి గేయం. పదవ తరగతిలో ఉన్నప్పుడు –

"వెన్నవంటి మనసున్నవానికి, అన్నమేమొ కరువాయె
ఉన్నవానికింతన్న వీడుదా
మన్న గుండె లేదాయె"

వంటి పాటలు రాశారు. కరీంనగర్ విద్యార్థి మహాసభలో –

విజయంబు సాధించినావా – విద్యార్థి, నీ వీర భావాలు నింగి వ్యాపించగా; నీ వైరి చిత్తాల నేల కంపించగా" వంటి గేయాలు రచించి పాడారు. ఉన్నత పాఠశాల విద్యాభ్యాస కాలంలోనే, నైజాం రాష్ట్రానికి స్వాతంత్ర్యం రావాలని జరిపిన విద్యార్థుల సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హైదరాబాదు ఛాదర్ఘాట్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో ఇంటర్ మీడియటును (1948–49) ముగించారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో వెలువడే 'జనశక్తి' పత్రికలో ఆయన కవిత తొలిసారిగా ప్రచురితమైంది. ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం అనే పద్య నాటికలను వ్రాశారు. 'భలే శిష్యులు' వంటి సాంఘిక నాటికలను రచించారు, ప్రదర్శించి, నటులుగా తాము పాత్రధారణ చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే 'బి.ఏ.' (1952) చదివారు. బి.ఏ. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక – 'శోభ'కు సంపాదకత్వం నిర్వహించారు. 1954లో ఎం.ఏ. పట్టా పొందారు. ఎం.ఏ. విద్యార్థిగా 'సినీకవి' అనే నాటికను వ్రాసి, 'మకరంద మూర్తి' అనే పాత్రను ధరించి, దర్శకత్వం వహించి, ఉత్తమ బహుమతిని అందుకున్నారు. 'ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య పల్లా దుర్గయ్య, ఆచార్య దివాకర్ల వేంకటావధాని తదితరులు ఆయన గురువులు. ఎం.ఏ. పూర్తి చేసి, 1954–55లో కొంతకాలం, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరరుగా పనిచేసి, అదే కాలేజీలో 1955లో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం ఆరంభించారు. 1958–59లో నిజాం కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేస్తునే 1957 నుండి 1962వరకు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సూచనను అనుసరించి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో – 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు' అనే విషయంపై పరిశోధన సాగించి, 1962లో పిహెచ్.డి. పట్టాను పొందారు. 1963లో ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో 'రీడర్' అయ్యారు. 1976లో ఆచార్యులై,1981 వరకు బోధన సాగించారు. నారాయణరెడ్డి భార్య సుశీల కాగా, నలుగురు కూతుళ్ళకు – గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి అని పేర్లు పెట్టు కున్నారు. ఆయన 50వ జన్మదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాషా సంఘాధ్యక్ష పదవిని అందించింది. ఆ జన్మదినోత్సవ సన్మాన సభలో నారాయణరెడ్డి –"ఎవరికి ఈ సన్మానం, ఎందుకు ఈ సన్మానం, చెట్టంతటి పేరొందిన చిగురుకు ఈ సన్మానం" అని ప్రారంభించి..."పేరేమో సింగిరెడ్డి, నారాయణరెడ్డి కాని, కులం కీళ్ళు విరిచే నాకలానికీ సన్మానం" అంటూ ఒక గేయకవిత చదవగా; సభంతా హర్ష ధ్వానాలతో మారుమ్రోగింది. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా 4–9–1981 నుండి 7–8–1985వరకు, సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, తర్వాత దేశంలో ప్రథమ సార్వత్రిక విశ్వ విద్యాలయమైన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులై, 8.8.1985 నుండి 20.6.1989 వరకు, విధులను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్ష పదవిని 21.6.1989 నుండి 4.11.1992 వరకు నిర్వహించారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ స్నాతకోత్సవం తెలుగులో నిర్వహింపబడిన సందర్భంలో, అప్పటి ఛాన్స్ లర్, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పాల్గొనగా, ఉప రాష్ట్రపతి డా. శంకర్ దయాళ్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 7.7.1991నాడు జరిగిన రెండవ స్నాతకోత్సవంలో, నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. 1990 మార్చి 10, 11, 12 తేదీలలో బెంగుళూరులో 'మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు' నిర్వహింప బడ్డాయి. అంతేకాక, మారిషస్ లో 1990 డిసెంబర్ లో ''మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు''నిర్వహించింది ఈ తెలుగు విశ్వ విద్యాలయమే. సినారె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆ తరువాత 1997 జులై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేశారు. ఆ సమయంలోనే భారత రాష్ట్రపతి రాజ్యసభ సభ్యునిగా నామనిర్దేశం చేయగా, 27.8.1997 నుండి 26.8.2003 వరకు కొనసాగారు. దక్షిణ భారతం నుండి రాజ్యసభ సభ్యులుగా నియమింప బడిన ప్రథమకవి ఆయనే కావడం విశేషం. నవ్వని పువ్వు'' (1953) మొదలుకొని, – 'అలలెత్తే అడుగులు' (2013), నింగికెగిరే చెట్లు (2014) వరకు 18 ప్రక్రియలలో సుమారు 90 గ్రంథాలు రచించారు. మాకందా'లను అందించడంలో, వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో 'ప్ర'పంచ పదులను నిర్మించడంలో – తెలుగు గజళ్ళకు మానవీయ దృక్పథాన్ని అనుసంధించడంలో, ప్రతీకాత్మకంగా వచన కవితలో 'ఇతిహాస కావ్యాన్ని'– 'విశ్వంభర'ను నిర్మించడంలో,'మట్టీ–మనిషీ–ఆకాశం' వంటి వచనకవితా 'కావ్యేతి హాసాన్ని' సంవిధాన సంపన్నంగా సృజించడంలో, 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' వంటి స్వీయ చలన చిత్ర గీతికా వ్యాఖ్యా రచనలో, ఋతువర్ణనలను జీవితానికి సమన్వయిస్తూ 'ఋతుచక్రం' వంటి కావ్యరచనలో, గేయ కావ్యాలకు పద్య కావ్య ప్రౌఢిని, ప్రామాణికతనూ సంతరించడంలో, శతశతాధిక నూతన పదబంధ కల్పనంలో మహాకవి సినారె ప్రయోగశీలం ప్రస్ఫుట మవుతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపన్యాసకులుగా ఉంటూనే, 1962లో ఎన్టీ రామారావు ఆహ్వానంపై చలనచిత్ర రంగంలో ప్రవేశించారు. తొలి సినీ గీతం – ''నన్ను దోచుకొందువటే''. 'గులేబకావళి కథ' చిత్రంలోని పాటలన్నీ ఆయన వ్రాసినవే. ఆనాటి 'గులేబకావళి కథ' చిత్రం నుండి ఇటీవలి 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు, మూడున్నర వేలకు పైగా సినిమా పాటలు రచించి, చలనచిత్ర జగత్తులో తమ ప్రత్యేక స్థానాన్ని భద్రపరచు కున్నారు. 'ఏకవీర', 'అక్బర్ సలీమ్ అనార్కలీ' అనే రెండు చిత్రాలకు సంభాషణలు కూడా రచించారు. తెలుగువారే కాక శంకర్ జైకిషన్, సి. రామచంద్ర, ఓ.పి. నయ్యర్, రవీంద్రజైన్, ఉషాఖన్నా, బప్పీలహరి – వంటి ప్రముఖ హిందీ సంగీత దర్శకులు 50 మందికి పైగా కలిసి పనిచేశారు. ఘంటసాల గళం నుండి సినారె గీతాలధికంగా జాలు వారాయి. మూగజీవులు, శభాష్ పాపన్న, మొగుడా పెళ్ళామా, తూర్పు పడమర చిత్రాలలో కావ్య సంబంధమైన పాత్రలలో ఆయన కనిపించారు.

### సినారె స్మరణకే విశ్వంభర

**తెలుగు వారు గర్వించదగ్గ మహాకవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, విశ్వంభర సృష్టికర్త డాక్టర్ సి.నారాయణ రెడ్డిని ఆయన జన్మదినం సందర్భంగా విశ్వంభర దినపత్రిక స్మరించుకుంటోంది. తెలుగు సాహిత్యానికి సినారె చేసిన సేవలు ఎనలేనివని అంటూ విశ్వంభర ఎడిటర్ కాచం సత్యనారాయణ అన్నారు. తెలుగువారి గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటారంటూ ఘనంగా నివాళులు అర్పించారు. సినారెను అనునిత్యం మననం చేసుకునేందుకే తమ పత్రికకు విశ్వంభర అని పేరు పెట్టినట్లు ఆయన వెల్లడించారు.**




-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సమాజంలో రాజ్యమేలుతున్న అవినీతి

**ఇందుగలదండు లేడని సందేహము వలదు... ఎందెందు వెతికి చూసినా అందందే గలడు.. అన్నట్టుగా సర్వాంతర్యామి ఉన్నాడో లేడో కానీ అవినీతి మాత్రం సర్వత్రా వ్యాపించి ఉందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సమాజంలో అవినీతి రాజ్యమేలుతుంది . ఇప్పుడది వికృతరూపం దాల్చుతున్నది. చివరకు ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడడం లేదు. దేశ రాష్ట్ర పురోగతికి పేద బలహీన వర్గాల అభ్యున్నతికి వేలాది కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన సంక్షేమ పథకాలు. అవినీతి కారణంగా ఆశించిన ఫలితాలు ఇవ్వడంలేదు. అవినీతి భరతం పడతామని... ఉక్కు పాదాలతో అణిచి వేస్తామని... కూకటివేళ్లతో పెకలించి వేస్తామని పాలకులు ఎంతగా అరుస్తున్న మాటలు తప్ప చేతలు ముందుకు కదలకపోవడం ప్రభుత్వాల అసమర్థత చాటిచెబుతున్నాయి. కష్టపడకుండా వీలైనంత తొందరగా లక్షీపతులు కావాలి అన్న ఆశలు రాజకీయ, వ్యాపార ప్రజానీకంలో విపరీతంగా పెరిగిపోతుంది. కొందరు అధికారులు బాధ్యత గల ఉన్నత పదవుల్లో ఉన్న కొందరు అధికారులు సైతం డబ్బుకు ఆశపడి మరి ఏ విషయాలను పట్టించుకోవడం లేదు. గౌరవ మర్యాదలను గురించి ఆలోచించడం లేదు. డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మంచి చెడు పట్టించుకోవడం లేదు. పోతే పోయింది పరువు డబ్బులు ఉంటే చాలు. డబ్బు లేకపోతే ఇంకేమన్నా ఉన్నదా? బతకగలమా? పక్కవారికి తెలియకుంటే చాలు అని కొందరు అవినీతి అధికారులు అడ్డమైన గడ్డి తినేందుకు వెనుకాడటం లేదు. దిగజారుతున్న మానవతా విలువలు పరిస్థితుల పట్ల నిజాయితీపరులైన అధికారుల ఆవేదన మౌన రోదనగా మిగిలి పోతున్నది. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ లాంటి విభాగాలు పెంచుకుంటూ పోతున్నా నిజాయితీ, అంకితభావంతో పని చేయ గలిగిన అధికారులను నియమించలేకపోతున్నారు.**



తెలంగాణలో గత ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో ఉద్యోగస్తులు, నాయకులు అవినీతి విషయంలో ఆడిందే ఆట పాడిందే పాటగా సాగిందనేది నగ్న సత్యం . తెలంగాణ వచ్చి పది సంవత్సరాల కాలంలో అవినీతికి అంతులేకుండా పోయింది. ఉద్యోగులు ప్రజల బాగోగులను పెద్దగా పట్టించుకోకుండా రాజకీయ నాయకుల పక్షాన నిలుస్తూ అటులంచాలు. ఇటు కమిషన్లు తీసుకుంటూ ప్రజల గోడును పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఇప్పటికీ ఎక్కడి వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుగా ఉంది. వివిధ సమస్యలపై జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక ప్రక్కన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. అధికారుల తీరుపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. నిజంగా తెలంగాణలో ఉద్యోగస్తులకు గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనంతగా ఇక్కడ ఉద్యోగులకు జీతాలు పెంచారు. ఇక మన ఉద్యోగస్తులు మాత్రం గతంలో బల్ల కింది నుంచి లంచాలు తీసుకునే వారు కానీ ప్రపంచీకరణ కొత్త ఐడియాలతో లంచాలు ఆన్లైన్లో ప్రజలు చెల్లిస్తున్న వైనం ఉన్నది. అధిక మొత్తం లంచాలు నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆర్టీవో ఆఫీస్. కోర్టులు .ఆబ్కారీ శాఖ, ఫైర్ డిపార్ట్మెంట్, పరిశ్రమల శాఖ, వాటర్ వర్క్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు లోకూడా తారా స్థాయికి ఎదిగిపోయిందనేది నగ్నసత్యం. కార్మిక శాఖ, విద్యాశాఖ, ట్రాన్స్పోర్ట్ శాఖ, హెచ్.ఎం.డిఏ, మున్సిపాలిటీ, జి .హెచ్ .ఎం .సి శాఖ, ప్రాణాలు సైతం కాపాడాల్సిన వైద్య రంగంలో కూడా దక్షిణ ఇవ్వందే నడవదు. ఇక మున్సిపాలిటీ, ఫుడ్ ఇన్స్పెక్టర్లు,పోలీసుశాఖల్లో అధికంగా లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక నీటిపారుదల,పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలో పనులు కేటాయింపులకు అధికారులు 10 నుంచి 15 శాతం కమీషన్ తీసుకుంటే గాని పనులకు బిల్లులకి పనుల కేటాయింపులు జరగడం లేదని అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు చెబుతున్నారు. హైదరాబాదు రంగారెడ్డి సంగారెడ్డి పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండా తూతూమంత్రంగా తనిఖీలు చేసి అందినకాడికి డబ్బులు అందుకొని నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు పొల్యూషన్ బోర్డు అధికారులపై అవినీతి మరకలు కూడా గతంలో మీడియా సాధన లో చూసాం కాలుష్యం వెదజల్లే పరిశ్రమలనుతనిఖీలు చెయ్యకుండా సీజ్ చేయకుండా నోటీసులు ఇవ్వకుండాఅధికారులు నామమాత్రపు ఫైన్వేసి చేతులు దులుపుకుంటున్నారు అనేది నగ్నసత్యం. పొల్యూషన్ బోర్డు అధికారులకు ఒక ఫ్యాక్టరీ నుండి 50 వేల నుండి ఐదు లక్షల రూపాయల వరకు ముడుపులు అందుతున్నాయని కొన్ని ఫ్యాక్టరీల యజమానులు పొల్యూషన్ బోర్డు లో ఉండే ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి .గతంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు పనిచేయని ఉద్యోగస్తుల పై చర్యలు దిగడం తప్పదని ఆయన గతంలో అన్నారు. రాజకీయంగా కొంత అవినీతి తగ్గిన మాట వాస్తవమే మంత్రులను మరి కొందరు నేతలు ముఖ్యమంత్రికి తెలుస్తుందేమో నని భయం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో తమ అనుమతి లేకుండా తమకు తెలియకుండా తమ నియోజకవర్గాల్లో ఎలా పోస్టింగులు తెచ్చుకుంటారు ? ఎలా పని చేస్తారని అధికారులు బెదిరించి సంప్రదాయాలకు నేటికీ కొనసాగుతున్నది. వారి అనుమతి కావాలంటే అంతోఇంతో ముట్టజెప్పే పరిస్థితి ఏర్పడుతుంది. పోస్టింగ్ ఇచ్చేటప్పుడు కూడా ఉన్నత అధికారులు ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు సిఫార్సులు లేక తెచ్చుకోమని చెప్పడం జరుగుతుంది. ఇక క్రింది స్థాయి అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న జీతభత్యాలు ఎక్కువే. క్రింది స్థాయి విధులు నిర్వహించే ఉద్యోగికి ఇస్తున్న జీతం దాదాపు రూ.28 వేల నుంచి రూ.60 వేల దాకా ఉంటుంది. ఇక ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులకు దాదాపు లక్ష రూపాయలు పైమాటే జీతాలు ఉంటున్నాయి. పంచాయతీరాజ్, నీటిపారుదల, కమర్షియల్ టాక్స్ ఆబ్కారి శాఖలో ప్రధాన విభాగాదిపతులకు లక్ష రూపాయల పైనే జీతాలు వస్తాయి.తెలంగాణలో ప్రతి జిల్లాలో దాదాపు 90 కోట్ల రూపాయల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. జీతాలతో పాటు ప్రభుత్వపరంగా రావాల్సిన ఇతర సదుపాయాలు అనుభవిస్తున్నారు. అదనపు ఆదాయం కోసం వెంపర్లాడుతున్నారని ఆ య ఉద్యోగులు అనుకుంటున్నారు. ఇంత నెలసరి జీతం వస్తున్నాఉద్యోగస్తుల పనితీరు మాత్రం మారడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక ఉద్యోగస్తులు సరైన సమయానికి ప్రభుత్వ ఆఫీసులకు రావడంలేదని బహిరంగ రహస్యమే. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ పథకాలను విజయవంతంగా చేయడంలో ఉన్నత అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు నిర్దేశించిన పనిగంటలను సైతం ఏ గొడుతున్నారు అనేది విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పని చేసేవాడు ఎప్పుడు పని చేస్తూనే ఉంటాడు అని నిర్లక్ష్యం వహించే పలువురు వివిధ స్థాయిల్లో ఉద్యోగులు కావాల్సిన పనులకు దుమ్మాలు కొడుతున్నారని కార్య ఆలయాలలో కష్టపడి పని చేస్తున్న ఉద్యోగులే చెబుతున్నారు. కొందరు ఉద్యోగులు ఉద్యోగ సంఘాల పేరిట ఆయా కార్యాలయాల్లో పని చేయవలసిన పనులను పక్క వాళ్లకు అప్పగించి గైర్హాజరు అవుతున్నారని చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని పలు కార్యాలయాలలో బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువచ్చింది. జిల్లాలలో డిస్ట్రిక్ట్ ఆఫీస్ మాన్యువల్ (D. O M)ప్రకారం ప్రభుత్వానికి చెందిన ప్రతి సిబ్బంది ఉదయం 10:30 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగ విధుల్లో కొనసాగుతారు. భోజన విరామం మినహా ఆరు గంటల పాటు ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల మనీ అధిపత్యాన్ని చెలాయిస్తూ ప్రభుత్వం వివిధ అవసరాల కోసం నియమించిన కాంట్రాక్ట్. ఔట్సోర్సింగ్, ఉద్యోగులతో బండచాకిరి చేయిస్తున్నారు. సుమారు రాష్ట్రంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగస్తులు వివిధ శాఖలలోఅవుట్సోర్సింగ్ ఉద్యోగస్తులు 35000 పైమాటే. ఇక రెవెన్యూ తదితర శాఖల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులు పై అధికారులు వారి లంచాలను అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తో తీసుకొని జేబులు నింపుకుంటున్నా మాత్రం ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులే బలవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణ పై ప్రభుత్వ నిఘా పెట్టాలి. గతంలో షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలంలో ఒక తహశీల్దార్ ఇంట్లో 90 లక్షల రూపాయలు దొరికినయంటే ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో ఒకసారి ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. అవినీతికి చిరునామాగా మారిన రెవెన్యూ వ్యవస్థ సంస్కరించాలని సీఎం రేవంత్ ఒకవైపు ప్రయత్నాలు చేస్తుంటే మరోవైపు లంచవతారుల లీలలు రోజురోజుకి బట్టబయలు అవుతున్నాయి. ఒక పక్కన రియల్ ఎస్టేట్ బూమ్ ఉన్నచోట ఏరికోరి పెద్దతలల కు లక్షలు ఎదిరించి మరీ పోస్టింగ్లు తెచ్చుకుంటున్నారు. గతంలో మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు ఏసీబీ వలలో పడ్డారు హైదరాబాద్ సంపన్న వర్గాలు నివసించే షేక్పేట మండలం ఎంఆర్ఓ వివాదాస్పద భూ వ్యవహారంలో తలదూర్చి ఏసీబీకి చిక్కారు. ఆదివారం జూన్ 7న తాసిల్దార్ సుజాత ఇంటిపై ఏసీబీ దాడి చేసి 30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇదే భూవివాదంలో ప్రైవేటు వ్యక్తులు అండగా నిలిచి ఆర్ఐ కూడా పట్టుబడ్డారు. అలాగే ప్రభుత్వ భూమిని బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 14 సర్వేనెంబర్ 129/59 ఉన్న 4865 ఆక్రమించిన కబ్జాదారులు సహకరించేందుకు లంచం డిమాండ్ చేసిన షేక్ పెట్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నా గార్జున రెడ్డి నుంచి రూ.15 లక్షలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ కబ్జాదారులకు అరెస్టు చేయకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ ఎస్సై రవీందర్ నాయక్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో శివారు జాయింట్ కలెక్టర్ పై ఏసీబీ దాడులు చేసి ఆదాయానికి మించిన ఆస్తులు కటకటాల వెనక్కి నెట్టింది. ఇదే జిల్లాలో పని అధికారులు కూడా ఏసీబీ వలలో చిక్కారు. ఆ తర్వాత శేర్లింగంపల్లి తాసిల్దార్ పనిచేసిన మహిళా అధికారి కూడా పాటుపడ్డారు. ఇక అబ్దుల్లాపూర్ మెట్టు తహసిల్దార్ సజీవ దహనం కేసులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. రంగారెడ్డి హైదరాబాద్ మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్న అధికారులు ఇక్కడి నుంచి కదలడానికి ఇష్టపడరు శతాబ్దాల కాలంగా నయా తాసిల్దార్ నుంచి అదనపు కలెక్టర్ వరకూ అదే జిల్లాలో కొలువులు వెలగబెడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసినా సేవలపై వెళుతూ ఉన్నారే తప్ప బాధ్యతలు తీసుకోవడం లేదు. ఈ అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం కొంత కష్టపడాల్సి ఉంటుంది. సమాజంలో అవినీతి బాహాటంగా ప్రజలందరి ముందు వికృత రూపం ధరించి నాట్యం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దురదృష్టకరం. ప్రస్తుత పాలకుల అవినీతి నియంత్రణకు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక దాడులు చేస్తూనే ఉంది. అవినీతి శాఖలో కూడా అవినీతిపరులు ఉన్నారు కానీ వారి పైన చర్యలు ఏవి? ఎసిబి అధికారులు ఎంతో మంది అవినీతి అధికారులను అరెస్టు చేస్తున్నారు. కోట్లాది రూపాయల ఆదాయానికి మించిన ఆస్తులు బయిటకు తీస్తున్నారు. అవినీతి అధికారులపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. తెలంగాణలో సుమారు2014 నుంచి2023 జూన్ వరకు సుమారు 1,962 కేసులు అవినీతి ఉద్యోగులపై నమోదయ్యాయి. కానీ శిక్షలు పడ్డా ఉద్యోగులు ఎంతమంది అనేది ప్రశ్న....?మరోపక్కగత ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో అవినీతిని సహించేది లేదని అవినీతికి పాల్పడితే ఎంతటివారైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని చివరకు తన కుటుంబ సభ్యులు ఎవరైనా అవినీతికి పాల్పడితే రుజువైతే జైలుకు పంపు తానని బహిరంగంగానే ప్రకటించారు. గత ముఖ్యమంత్రి కుమారుడు మాజీ మంత్రి కేటీ రామారావు మరో అడుగు ముందుకు వేసి లంచం అడిగిన వారిని చెప్పుతో కొట్టు మన ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏసీబీ మెరుగుపరచాలి. మీడియా సాధనాల ద్వారా ఏసీబీ ఫోన్ నెంబర్లు తెలియజేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల ద్వారా, పాఠ్యపుస్తకాల్లో అవినీతిపై ఒక చాప్టర్ ఉండాల్సిన బాధ్యత అవసరం ఉంది. భావి భారత పౌరులకు అవినీతి పైన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ప్రభుత్వ నైతిక బాధ్యత. ప్రతి గవర్నమెంట్ ఆఫీస్ దగ్గర రేషన్ కార్డు ఆధార్ కార్డు పైన ఓటర్ ఐడి కార్డు పైన ముద్రించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో పారదర్శకత పాలన ఉండాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. చీమ చిటుక్కుమన్నా ఇంటెలిజెన్స్ విభాగం ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చెవుల్లో వేస్తూనే ఉంటారు. ఏసీబీలో మూడో కంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతి నీ ఆర కట్టకపోతే కరోనా మహమ్మారి లాగా మారి తెలంగాణ ప్రాంతానికి ఇబ్బందులు తప్పవు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం త్వరలో తీసుకుంటాడని ఆశిద్దాం.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ, రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ :9550844433



## గీత కార్మికులకు బడ్జెట్లో సముచిత స్థానం కల్పించాలి

- తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కోటయ్య

**విశ్వంభర, సూర్యపేట :** గీత కార్మికులకు బడ్జెట్లో సముచిత స్థానం కల్పించాలని గీత పని వారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, కొండ కోటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం భవనంలో జిల్లా నిర్మాణం విస్తృత కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గీత వృత్తిని ప్రోత్సహించడానికి 1000 కోట్లు బడ్జెట్ కేటాయించి గీత కార్మికులు జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా వైద్య విద్యా సౌకర్యాలు వారి కుటుంబాలకు కల్పించాలని అన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో కాలం పరిమితి తీరిన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి ఆ సొసైటీలకు 5 ఎకరాల భూమి చెట్ల పెంపకానికి వనరులను సమకూర్చాలన్నారు. స్వతంత్ర సమరయోధుడు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బంబ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో, మండలాల్లో సభ్యత్వాన్ని చేర్పించి విస్తృతస్థాయి కమిటీలను ఏర్పరచుకొని కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ దొరేపల్లి శంకర్, సంఘం నాయకులు పాలకూరి బాబు, బూర వెంకటేశ్వర్లు, తొట్ల ప్రభాకర్, సొసైటీ మాజీ అధ్యక్షులు అనంతుల జానయ్య, బొడ్డు రామచంద్ర, పెద్దపోలు విష్ణుమూర్తి, తండ నరసయ్య, కొండ వెంకయ్య, బూర సైదులు, రెడిమల శీను, అయితే గాని కామేష్, దిండు గల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు మిత్రుల ఆత్మీయ సమ్మేళనం

### 35 వసంతాల సర్వీస్ తర్వాత ఒకచోట చేరిన మిత్రులు

**విశ్వంభర, జగిత్యాల :** కత్తిమీద సాము లాంటి కరుకుదనమైన పోలీస్ కానిస్టేబుల్ వృత్తి వారిది క్రమశిక్షణ, నిబద్ధత, నైపుణ్యాలను పదునుపెట్టుకుంటూనే మరోపక్క అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నమైన వారు ముప్పై అయిదు వసంతాల పోలీస్ సర్వీస్ పూర్తి చేసుకొని వివిధ జిల్లాల్లో విధుల్లో కొనసాగుతున్నారు.కొందరు ఉన్నత అధికారులుగా పదోన్నతులు పొందగా ఒకరిద్దరు నక్సల్స్ పేల్చిన మందుపాతరలలో,ఎన్ కౌంటర్ లలో అసువులు బాయగా, దీర్ఘకాలిక వ్యాధులతో మరికొందరు మరణించారు.కాగా ఇటీవల పదవీరమణ పొందిన వారు వీరిలో ఉన్నారు. వారందరు సరిగ్గా 35 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకొని ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకునుటకు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రం వేదికయ్యింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1989వ సంవత్సరానికి చెందిన పోలీస్ బ్యాచ్ 35 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసుకొని నేటి కార్యక్రమం ద్వారా 36 వ సంవత్సరం లోకి అడుగుపెట్టిన శుభ సందర్భంగా జగిత్యాల జిల్లా 1989 పోలీస్ బ్యాచ్ లోని జగిత్యాల డిఎస్పి లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై రాజేషుని. శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ వావిలాల గంగాధర్, కోరుట్ల ఎస్పి హెడ్ కానిస్టేబుల్ రషీద్, గొల్లపల్లి ఎస్పి హెడ్ కానిస్టేబుల్ బోయిని శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్ లో ఆదివారం పోలీస్ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మొదట తమ తోటి మిత్రులు వివిధ సందర్భాలలో మరణించిన వారికి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించిన పిదప కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.అయితే వారిలో ఉన్నత అధికారులుగా పదోన్నతులు పొందిన అదే బ్యాచ్ కు చెందిన జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రం, జగిత్యాల ఎస్సై సుధీర్ రావు, ఏ ఎస్సై లు అంజయ్య, కర్ణాకర్, కమటం మల్లయ్య తోసహా పలువురిని పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించి నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం 35 సంవత్సరాల సుధీర్ఘ అనుభవాలను సుఖ సంతోషాలను వారు ఒకరినొకరు పంచుకొని ఆనందంగా గడిపారు అనిర్వచనీయమైన ఆనందాన్ని స్వంతం చేసుకున్నారు. దాదాపు 50మంది 1989బ్యాచ్ పోలీస్ మిత్రులు పాల్గొన్నారు.



## సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ల సమావేశం

**విశ్వంభర, వనపర్తి :** హైదరాబాద్‌లో దిల్సుఖ్నగర్ ట్రైన్ రెస్టారెంట్‌లో ఆదివారం టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ నవీన్ పెట్టం ఆధ్వర్యంలో నిర్వహించిన 33 జిల్లాల సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ సమావేశంలో పాల్గొన్న వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం దేవన్న యాదవ్. ఇట్టి కార్యక్రమంలో నవీన్ మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో సోషల్ మీడియా విభాగ కృషి మరువలేనిదని మనం ఆనాడు ప్రతిపక్షంలో ఉండి ఏ విధంగా పోరాడేమో నేడు మన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే విధంగా మన కార్యచరణ ఉండాలని మండల కోఆర్డినేటర్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి అందరు కలిసి జిల్లాలో మండలాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేట ర్లకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

చింతపల్లి మండల వ్యాప్తంగా పల్లెల్లో, మారుమూల తండాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్నా నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంది. గుడుంబా తయారీ దారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మల్లుతున్నారు. గుడుంబాను నిరోధించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మూలాలపై దృష్టిపెట్టకుండా అడపాదడపా దాడులు చేస్తూ అమ్మకందారులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో గుడుంబా తయారు చేసేవాళ్లకు గత ప్రభుత్వం పునరావాసం కల్పిస్తూ పలు పథకాలను అమలు చేసింది. అయినప్పటికీ కొందరు గుడుంబా కాయడమే వృత్తిగా పెట్టుకుని పల్లెల్లో, తండాల్లో జోరుగా దందాను సాగిస్తున్నారు. గుడుంబా కేవలం పల్లెలు, తండాలకే పరిమితం కాకుండా ఇప్పుడు పట్టణాలకు సైతం పాకింది.



# గుట్టుగా గుడుంబా తయారీ

- పల్లెల నుంచి పట్టణాల దాక జోరుగా విక్రయాలు
- మద్యానికి బదులు, సారా తాగుతున్న పేదలు
- గుడుంబా మూలలపై దృష్టి సారించని ఎక్సైజ్ శాఖ
- లంచాల మత్తులో తూగుతున్న అధికారులు

**విశ్వంభర, చింతపల్లి :**

చింతపల్లి మండలంలో నాటుసారా తయారీ జోరందుకుంది. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తక్కువ ధరల్లో లభించే గుడుంబా వైపు మరులుతున్నారు. దీంతో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ సారా అమ్మకాలు జోరుగా సాగు తున్నాయి. మండలంలోని వివిధ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయారవుతోంది. గుట్టుచ ప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తున్నారు. రోటిగడ్డ తండా, జర్పుల తండా, పల్లె తండా, కోర్ర మాన్ సింగ్ తండా, బోటి మీది తండా, ఎర్రమట్టి తాండ, చౌళ్ళ తండా, బోత్య తండా, దేవుల తండా, పాలెం తండా, ప్రశాంతపూరి తండాలలో మారుమూల గ్రామా ల్లో, అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇతర గ్రామాలు, పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు సారా తయారీనే వృత్తిగా మలుచుకొని పెద్దఎత్తున తయారుచేసి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గుడుంబా తయారీ పెద్దఎత్తున సాగేది. అప్పట్లో గత ప్రభుత్వం తయారీకి అడ్డుకట్ట వేయడానికి బెల్లం తయారీని నిషేధించింది. దీంతో పాటు సారా తయారీకి అలవాటు పడిన కుటుంబాలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించారు. అనంతరం వారు సారా తయారీ మానుకునేలా చర్యలు తీసుకున్నారు. అయింతే ఇటీవల కాలంలో తిరిగి సారా గుప్పుమంటోంది. కొందరు తమ కోసం ఇప్పపువ్వుతో మేలి రకం సారా తయారు చేసుకుని తాగుతుండగా మరికొందరు ఇప్పపువ్వుతో పాటు బెల్లం, కుళ్లిన అరటిపండ్లు, ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా సాగిస్తున్నారు.





### గుడుంబాపై ఎక్సైజ్ శాఖ నిఘా కరువు

మండలంలోని నిషేధిత గుడుంబాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నాటుసారా తయారు చేసే మూలాలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో విచ్చలవిడిగా నాటుసారా తయారవుతుందనే వాదన వినిపిస్తోంది. సారా అమ్మకాలు ఆగాలంటే తయారీ మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గుట్టుగా తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గుడుంబాను పెద్ద ఎత్తున తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో పంట చేన్ల వద్ద గుట్టుగా తయారు చేస్తున్నారు. అయితే అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు తండాలపై దాడులు నిర్వహించి సారా అమ్మకాలపై వెతుకుతున్నారు. మూలాలను వెతకకుండా ఎక్కడో ఒకచోట దాడులు నిర్వహిస్తున్నారు. సారా ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించి పక్కా వ్యూహంతో దాడులు చేస్తే అసలు నిందితులు దొరికే అవకాశం ఉంది.

### మందుబాబులు నాటుసారా వైపు

మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం సారాకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగాలంటే వందల రూపాయలు వెచించాల్సి వస్తోంది. క్వాటర్ మద్యం కోనాలన్నా రూ.200 లకు పైగానే ఖర్చవుతోంది. ఇలాంటి సమయంలో తక్కువ ధరల్లో దొరుకుతున్న గుడుంబా తాగేందుకు మందుబాబులు నాటుసారా వైపు చూస్తున్నారు. మండలంలోని మాల్ వెంకటేశ్వర నగర్, కుర్మేడు, చింతపల్లి కూడళ్లలో పేదలు, కూలీలు నివసించే పలు కాలనీల్లో గుడుంబా, సారాను కొందరు ఇనుప వస్తువులు తయారు చేసే వ్యక్తులు ఎక్కువగా తాగుతున్నట్లు తెలుస్తోంది. గుడుంబా అమ్మకాలు గుట్టు చప్పుడు కాకుండా చాప కింద నీరులా పారుతుంది. రోజువారి కూలీ పనులు చేసుకుని బతికేవారు చాలా మంది సారా, గుడుంబా తాగుతున్నట్లు సమాచారం.

## సాహిత్యం సమాజ హితాన్ని కోరుకుంటుంది

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**విశ్వంభర, వనపర్తి :** సాహిత్యం సమాజ హితాన్ని సామాజిక ప్రయోజనాన్ని కోరుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తి పట్టణం లోని యాదవ సంఘ భవనంలో ప్రముఖ కవి రచయిత నాగవరం బాల్ రాం రచించిన రిఫ్లెక్షన్స్ పుస్తకా విష్కరణ జరిగింది. కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పుస్తకావిష్కరణ చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం ఒక దేశ సంస్కృతిని ప్రతిబింబింపజేయడమే గాక మానసిక వికాసం, పరిణితిని కలిగిస్తుందని వివరించారు. నాగవరం బాల్ రాం గత యాభై ఏళ్లు తమ సాహిత్య జీవితంలో మనిషికి సమాజానికి సంబంధించిన అనేక అంశాల ను వివిధ కోణాలలో విశ్లేషించి కవితలు రాశారని అన్నారు. సమాజంలో వివాదాలు, వివక్షలు లేకుండా ప్రశాంతంగా ఉండేలా మనిషి ఎదగాలనేది ఆయన ఆకాంక్షగ నిరంజన్ రెడ్డి తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలోనూ సాహిత్య జీవితంలోనూ నాగవరం బాల్ రాం అజాత శత్రువుగా ముందుకు సాగుతున్నారని కొనియా డారు.రిఫ్లెక్షన్స్ కవితలు నేటి తరం చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అందుకుకు ఆ పుస్తకాలు జిల్లాలోని ప్రతి పాఠశాలకు అందజేసెలా తాను ఆర్థిక సాయం అందజేస్తానని అన్నారు. నిర్వాహకులు కవి, రచయిత బాల్ రాం ను శాలువా పూలమాల జ్ఞాపికలతో సన్మానించారు.అతిథులుగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు లక్ష్మయ్య ప్రముఖ వైద్యులు డా భూపెష్ కుమార్, సుజాతమ్మ కిరణ్ కుమార్, సత్తార్,చిన్న రాములు, కౌన్సిలర్స్ వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్ నాగన్న, గులాం ఖాదర్ సాహితీ వేత్తలు కోట్ల వెంకటేశ్వర రెడ్డి వనపట్ల సుబ్బయ్య, డా.వీరయ్య బైరోజు చంద్ర శేఖర్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**విశ్వంభర, కోరుట్ల :** లయన్స్ క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో మనోవరీ హాస్పిటల్ లో ఉచిత ఫైబ్రోస్కాన్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నటరాజు మాట్లాడుతూ కాలేయానికి సంబంధించిన జాగ్రత్తలు వివరించారు.ప్రజలందరూ కాలేయానికి సంబంధించి తగు జాగ్రత్తగా ఉండాలని సమయానికి డాక్టర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 90 మంది ప్రజలకు లివర్ స్కానింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత లయన్ డాక్టర్ ముక్క ఇంద్రనీల్,గీత ఇంద్రనీల్ మరియు లైన్స్ క్లబ్ కోరుట్ల అధ్యక్షులు కుందారపు మహేందర్, కార్యదర్శి శ్రీగద్దె. నరేంద్ర, కోశాధికారి జగపతి రెడ్డి పాల్గొన్నారు.



## బడ్జెట్‌పై ఎస్ఎఫ్ఐ నిరసన

**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి ప్రభుత్వం నిధులు తగ్గించినందుకు నిరసనగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేయాలని పిలుపు ఇచ్చింది. ఈ మేరకు బడ్జెట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జనగామ జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎకతాటిపై బడ్జెట్ కేటా యింపులు చేయాలని ఆందోళనలలో పాల్గొంటే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఐ శ్వేతపై ఒత్తిడి తెచ్చి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షంపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. ఈ అక్రమ కేసులు తక్షణమే బేషరతుగా ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 15% నిధులు తాము విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి ఆచరణలో 7.3% మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. కేసులు ఎత్తివే యకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి :** మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటి రక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, మొక్కల పెంపకంతో మానవమనుగడ సాగుతుందని, భవిష్యత్ తరాలకు చక్కటి అహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుదీర్, మున్సిపల్ చైర్మన్ అశోక్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, డిసిసి ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి అక్బర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎజాజ్, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

పరిగి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, పూడూరు మహమ్మదాబాద్, గండ్వీడ్ మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు 54 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమన్నారు. అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రిలో చికిత్స పొంది వారి గ్రామానికి వచ్చిన తర్వాత ఆసుపత్రి ఖర్చులను ప్రభుత్వం భరిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల రూపాయల నుంచి పది లక్షల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరుశురాం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎజాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, తౌరియా నాయక్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**విశ్వంభర, మెట్‌పల్లి:** కోరుట్ల నియోజకవర్గంలో వర్షాలు నిర్విరామంగా కురుస్తున్నాయని రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్షాలు మరింత పడే అవకాశం ఉన్నందున నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ అత్యవసర శాఖల అధికారులు అవసరమైతే ముందస్తు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రానున్న మరో నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున నిరంతరం వర్షాల కారణంగా నియోజకవర్గంలో ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శివారు ప్రాంతాల్లో చెరువు కట్టలు తెగిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు దూరంగా ఉండాలని కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా పశువులకు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరయం లేకుండా చూడాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాధులు ప్రబలకుండా కూడా నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించి పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో తాగునీరు వర్షాల కారణంగా కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైప్ లైన్ లీకేజీలు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ముఖ్యంగా ప్రజల శిథిల వ్యవస్థలో ఉండి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లలో ఉండేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చు అన్నారు. వర్షాకాలంలో వాతావరణంలో మార్పులు వస్తున్నాయని ఈ నేపథ్యంలో పరిశుద్ధం క్షీణించి దోమలు వృద్ధి చెంది విష జ్వరాలతో పాటు డెంగ్యూ మలేరియా అతిసారం చికెన్ గునియా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది మున్సిపల్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**విశ్వంభర, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎల్లారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, జహీరాబాద్ ఎంపీ సురేష్ శేట్కర్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోనీ 8 మండలాలకు చెందిన 113 మంది లబ్ధిదారులకు 50 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ శేట్కర్ మాట్లాడుతూ తన గెలువు కోసం నిరంతరం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కొరకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున పార్లమెంటులో గళం విప్పి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటి సారి ఎల్లారెడ్డి నియోజకవర్గనికి వచ్చిన సురేష్ శేట్కర్‌కి అభినందనలు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఎంపీ నిధులతో కూడా ఎల్లారెడ్డి అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపాడు గ్రామం నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి నాయకులు కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న ఆధ్వర్యంలో కురుమ సంఘం అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వర్లు, సూగురు వీర సోమయ్య, అశోక్, ప్రశాంత్, అంబోజు కనకయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాస లక్ష్మా రెడ్డి, మాజీ సర్పంచ్ నగేష్, మాజీ ఎంపిటిసి కట్టెకొల హనుమంతు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్, మండల కో ఆప్షన్ మాజీ మెంబర్ ఎండీ యూసుఫ్, బీర్ల ఫౌండేషన్ ఇన్‌చార్జి బత్తిని ఉప్పలయ్య గౌడ్, రైతు సంఘం అధ్యక్షులు పోకల రామచంద్రు, ఇందూరు లింగయ్య, కోలా సత్తయ్య, ఇందూరు పరమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జీడి సాయమ్మ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిపిఐ మిత్రపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, కుల్కచర్ల :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నూతన భవ నాన్ని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల ల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. బడిడు పిల్ల లను ప్రభుత్వ బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బాధ్యతగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందే విధంగా ఉపాధ్యాయులకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి, మండల పిఏసిఎస్ చైర్మన్ మొగులయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ సత్యహరిచందర్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజు, ఎంపీ ఓ కరీం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ నూతన ఆవోప కమిటీ ఎన్నిక




**విశ్వంభర, షాద్‌నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో నూతన ఆవోప షాద్ నగర్ 2024 - 2026 కమిటీ ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా ఎలుకుర్తి నాగరాజుగుప్త, ప్రధాన కార్యదర్శిగా శివ కార్తీక్ గుప్త, కోశాధికారిగా ధర్మపురం మనోజ్ గుప్తని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవోప పూర్వపు అధ్యక్షులు శ్రీ బెజుగం రమేష్ గుప్త, సోమ రాఘవేందర్ గుప్త, గడ్డం నందకిషోర్ గుప్త, పెండ్యాల జగదీశ్వర్ గుప్త, రంగారెడ్డి జిల్లా ఆవోప అధ్యక్షుడు గుడిపల్లి వెంకటరమణ గుప్త, ఎంవిఎస్ సురేష్ గుప్త, ఆవోప ప్రధాన కార్యదర్శి కల్వ మాణి క్యం గుప్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం సలహా సంఘ సభ్యులు ఎంసాని శ్రీనివాస్ గుప్త, పెద్ది రామ్మోహన్ గుప్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వ యాదగిరి గుప్త, ప్రధాన కార్యదర్శి కల్వ మురళి గుప్త, కోశాధికారి నర్సిని వెంకటేష్ గుప్త, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి వజ్రలింగం గుప్త ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం వింజమూరు ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వింజమూర్ ఎక్స్ రోడ్డు వద్ద అదే గ్రామానికి చెందిన రామావత్ కేశవులు (60)రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వెళ్తున్న బ్రెజ్జ కారు అతివేగంతో అతనిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే రామావత్ కేశవులుకు ఒక కుమారుడు పూర్తి అంగవైకల్యం కలవడానికి స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యాదయ్య తెలిపారు.



## బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2001- 2002 వ సంవత్సరం పదో తరగతి చదివిన పెద్ద పడిశాల గ్రామానికి చెందిన రావుల మధుసూదన్ తండ్రి రావుల యాదగిరి అకాల మరణానికి చింతిస్తూ 2001- 2002 పదో తరగతి మిత్రులు తమ తోటి మిత్రుడికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో (టీజేయూ) తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అడ్డగూడూర్ మండల అధ్యక్షుడు చింత సుధాకర్, అంబటి, వేణు, అంబటి సమ్మయ్య, సుక్క సోమయ్య, ఆకుల మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా లింబాద్రి ఎన్నిక

**విశ్వంభర, మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా మెట్పల్లి పట్టణానికి చెందిన మైలారపు లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మహాసభ అధ్యక్ష పదవి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన జిల్లా ఆర్యవైశ్య కుటుంబ సోదరులకు ధన్యవాదాలు తెలియజేశారు.



# నేతన్నలకు అండగా ప్రభుత్వం

## ధన్యవాదాలు తెలిపిన నేతన్న సుదర్శన్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ నేత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేతకి ఉతమిచ్చేలా నేతన్నలకు అండగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చేనేతకి పెద్ద పీట వేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ కి 355 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్ పెట్టారని అన్నారు. ఈ 355 కోట్ల రూపాయల బడ్జెట్‌లో చేనేత కార్మికులకు , హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ కి , గ్రామీణ స్థాయిలో చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి భారీగా నిధులు బడ్జెట్‌లో పెట్టిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.



## వర్షాలకు కూలిన ఇల్లు

**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామానికి చెందిన గోగుల తిరుపతి ఇల్లు కూలిపోయింది. గత పది రోజులుగా కురుస్తున్న భారీ తన ఇల్లు కూలిపోయిందని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.



## కస్తూర్బా పాఠశాలలో వనమహోత్సవం

**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన కస్తూర్బా పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి అటవీ శాఖ రేంజ్ అధికారి వెంకటేశ్వరరావు చెట్లను నాటారు. సందర్భంగా ఆయన చెట్లు అడవుల వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ అధికారులు రాజేందర్, అఫ్జల్, కృష్ణ, వినోద్ తోపాటు పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



దివంగత మహానేత మాజీకేంద్రమంత్రి జైపాల్ రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో జైపాల్ రెడ్డి ఘాట్ వద్ద తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. ఆయన వెంట గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , మాజీ జడ్పిటిసి పాశం రాంరెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

**– విశ్వంభర, హైదరాబాద్**



బోడుప్పల్ బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్‌తో కలిసి బంగారు మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆయన వెంట నగర అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

**– విశ్వంభర, బోడుప్పల్**

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### ఉప్పల శ్రీనివాస్ గుప్త



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఆదివారం ఐవిఎఫ్ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల, రాజు ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయం కొత్తపేటలో జరిగిన అనుగ్రష్టమి అనుఘా దేవి దత్తవ్రతంలో ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట ర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిం చడం అభినందనీయం అని, మహిళలు అంద రూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులు అందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని, గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులు అందరి మీద వుండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో నాగోల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భిక్షపతి, నరేష్, సంపత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర, మెట్‌పల్లి :** పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని ఆదివారం అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి పరిశీలించారు. సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీలత ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో 48 మంది విద్యార్థులు ఉన్నారు.వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం లో ఉన్న బియ్యంను ఆయిల్ ప్యాకెట్లను పరి శీలించారు. గదులను, వాటర్ హ్యాండ్ బోర్ బాత్రూంలను పరిశీలించారు. బాత్రూంలో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని వసతిగృ హం నిర్వాహణ బాగున్నదని స్థానిక కమిషనర్ మూడు రోజులకు ఒకసారి వసతి గృహాన్ని పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, ఎంపీడీవో, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరా న్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నరసయ్య, అశోక్, నిజాం, నరేష్ పాల్గొన్నారు.

# మనుని అభినందించిన రాష్ట్రపతి ముర్ము




**విశ్వంభర, ఢిల్లీ :** "పారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్ ఈవెంట్‌లో కాంస్య పతకంతో భారతదేశాన్ని పతకాల పట్టికలో నిలిపి ఖాతా తెరిచినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భాకర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒలింపిక్స్‌లో షూటింగ్ విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన మను భాకర్‌ను చూసి భారతదేశం గర్విస్తోందన్నారు.

## భాగ్యలక్ష్మి దేవాలయంలో


# మంత్రి కోమటిరెడ్డి పూజలు



**విశ్వంభర, చార్మినార్ :** చార్మినార్, భాగ్యలక్ష్మి అమ్మవారి బోనాల కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని అమ్మవారికి అధికారికంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి కోరారు. గత సంవత్సరం వర్షాలు లేక రైతులంతా ఇబ్బంది పడ్డారిని, ఈసారి అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తాము హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నామని తెలిపారు. అఖిలపక్ష నిర్ణయానికి అనుగుణంగా పాత డెజైన్‌తో కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల ప్రజల ఆరోగ్యాలను దెబ్బతిస్తున్న మూసి నదిని ప్రక్షాళన చేస్తామన్నారు. పాత బస్తీ స్థితిగతులను మార్చేందుకు మెట్రోను విస్తరిస్తామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 10 వేల కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. మేడిగడ్డ కుంగినప్పుడు అధికారంలో ఉన్నది కేటీఆరే అని, అయినా కుట్రలు చేస్తే డ్యామ్ లోపలికి ఎలా కుంగుతుందని మంత్రి ప్రశ్నించారు. పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రాని బీఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు.

# ఢిల్లీ వరదల్లో తెలంగాణ విద్యార్థిని సోని మృతి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి



**విశ్వంభర, హైదరాబాద్:** దిల్లీలో రాజేంద్రనగర్ లోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా సికింద్రాబాద్‌కు చెందిన తానియా సోని అనే(25) ఏళ్ల యువతి మృతిచెందిన ఘటనపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తానియా సోని తండ్రి విజయ్ కుమార్‌ను కిషన్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భౌతికకాయం వీలైనంత త్వరగా కుటుంబసభ్యులకు అప్పగించేందుకు సంపూర్ణంగా సహకరిస్తామని తెలియజేశారు. దిల్లీ పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న అన్ని ఫార్మాలిటీస్‌ను త్వరగా పూర్తిచే యడంలో చొరవ తీసుకోవాలని ఢిల్లీలోని తన కార్యాలయ సిబ్బందిని కిషన్ రెడ్డి ఆదేశించారు.

# రహదారులను నాణ్యతతో నిర్మిస్తాం : మంత్రి పొంగులేటి



**విశ్వంభర, ఖమ్మం :** రాష్ట్రంలో పేదల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో సుమారు రూ. 2.5 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న కిష్టాపురం- తురకగూడెం, తురకగూడెం- చితల్‌తండా రహదారుల నిర్మాణాలకు, పాలేరులో సైడ్‌డ్రైన్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను నాణ్యతతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 37మందికి రూ. 8.16 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగడ్ల నర్సింహారావు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆదివారం జుజ్జుల్‌రావుపేటలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధు-సూదన్‌నాయక్, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, బోడా మంగీలాల్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న మొబైల్ అప్పగించిన ఎస్ఐ

**విశ్వంభర, ధర్మారం :** ధర్మారం మండలం గోపాలరావు పేట గ్రామానికి కేంద్రానికి చెందిన మైస సంతోష్ తన మొబైల్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. అనంతరం దగ్గరలోని ధర్మారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్ గుర్తించి ఆదివారం బాధితునికి అప్పగించారు. ఇందుకు గాను బాధితుడు ఎస్ఐ శీలం లక్ష్మణ్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.




తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒకరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, ఆ అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ.. గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమమహేందర్‌రెడ్డి డివిజన్ పరిధిలోని కుటుంబసభ్యులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**– విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్**

## పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

### బిజెపి మండల అధ్యక్షుడు మధుకర్



**విశ్వంభర, వేమనపల్లి :** గత పది హేను రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవ హించడం వలన నది బ్యాక్ వాటర్ తో మండలంలోని కల్లంపల్లి, సుంపుటం, వేమనపల్లి, కేతనపల్లి, ముల్కల పేట, నీల్వాయి, గొర్లపల్లి, రాచర్ల గ్రామాల శివారు లోని వేల ఎకరాల్లో పత్తి పంట నష్టపోయిందనీ రైతులు అరుగాలం శ్రమించి అప్పులు చేసి పంటలు సాగు చేస్తే ప్రాణహిత నది పంటనంత తుడిచిపెట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.ఇంత పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగి అన్నదాతలు అల్లాడుతుంటే ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే రైతులను నష్ట పోయిన పంటలను పరిశీలించడానికి కూడా రాలేదనీ,కనీసం రెవెన్యూ అధికారులు కానీ,వ్యవసాయ అధికారులు కానీ క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించక పోవడం విడ్డూరంగా ఉందనీ అసలు మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నట్ట..లేనట్టా....కనీసం మండలంలో నది బ్యాక్ వాటర్ తో ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయింది ఎంతమంది రైతులు నష్టపోయారనేది కూడా సర్వే చేయడం లేదనీ ఇప్పటికైనా మండలంలో అధికారులు నష్టపోయిన పంటల వివరాలను సర్వే చేసి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నారు




బోనాల పండుగను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గ ఆర్కేపురం డివిజన్‌లోని ప్రత్యంగిరా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ. ఆయన వెంట నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, రాజు గుప్త తదితరులు ఉన్నారు.

**– విశ్వంభర, ఎల్బీనగర్**



## లక్ష్మీనగర్ కాలనీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో ఆదివారం బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీలోని మైసమ్మ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మందుల శ్రీధర్‌రాజ్, వాయన్నయాదవ్, రాష్ట్ర బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, మహేశ్‌యాదవ్, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ చారి, లక్ష్మీనారాయణ, చక్రాల వెంకటేష్, జెల్లా రిషి, వేణుగోపాల్, వెంకట గాంధీ, రామన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశిస్సులు ప్రజలందరిపై ఉండాలి

- బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న తోటకూర వజ్రెష్ యాదవ్

**విశ్వంభర, బోడుప్పల్ :** గ్రామ దేవతల దయ ప్రజలందరిపై ఉండాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెశ్ యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ బోనాల పండుగ సందర్భంగా బోడుప్పల్ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయమన్నారు. ఊరి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా గ్రామ దేవతలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారనే నమ్మకంతో ప్రజలు ఏటేటా గ్రామ దేవతలకు బోనం సమర్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్‌గౌడ్, నాయకులు పోగుల వీరారెడ్డి, కొత్త కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల వేడుకలు

## ఖిల్లా మైసమ్మకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క


ఎల్బీనగర్ : మంత్రి సీతక్కను సన్మానిస్తున్న నాయకులు

**విశ్వంభర, ఎల్బీనగర్/కూకట్‌పల్లి/షాద్‌నగర్/శంషాబాద్/కరీంనగర్/అంబర్‌పేట :** ఆషాడ మాస అతిపెద్ద బోనాల పండుగ సందర్భంగా ఆర్కే పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ ఆలయంలో మైసమ్మకు మంత్రి సీతక్క ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్న గారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేశ్, దేవాలయ ఈఓ మురళీ కృష్ణలు మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రభుత్వం బోనాలకు రూ.25 కోట్లు కేటాయించి ఘనంగా బోనాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఖిల్లా మైసమ్మ దేవాలయం, ఎన్టీఆర్ నగర్ పేస్3లో జరుగుతున్న బోనాలు ఉత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేష్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, పొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, అనురాధ, స్వప్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎల్బీనగర్ : బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

### శేర్లింగంపల్లి నియోజకవర్గంలో...

బోనాల పండుగ సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంతరావు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ సాగర్, దుర్గరావు, రిక్కల పరమేష్ రెడ్డీ, పేరువాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### షాద్‌నగర్ సాయిబాబా కాలనీలో...

షాద్‌నగర్ పట్టణంలోని 6 వార్డు సాయి బాబా కాలనీలో బోనాలు కార్యక్రమంలో భాగంగా పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లత శ్రీశైలం గౌడ్, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డి, కాలనీ వాసులు వెంకన్నబాబు, క్రాంతి కుమార్, శివ, చంద్రయ్య, అమర్నాథ్ రెడ్డి, కిరణ్, జగన్, శ్రీశైలం, విక్రమ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### పెద్ద షాపూర్‌లో..

శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్‌లో బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### అంతిరెడ్డిగూడెంలో..

నందిగామ మండలంలోని అంతిరెడ్డి గూడెంలో బోనాల పండుగకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..బోనాల పండుగ తెలంగాణ ప్రజలు ఎంతో సంప్రదాయంగా గోప్పగా ఈ ఆషాడ మాసంలో జరుపుకునే పండుగ అన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, మాజీ ఎంపిటిసి కుమారస్వామి గౌడ్, దేపల్లి అశోక్ గౌడ్, తుమ్మల జగన్ యాదవ్, తుమ్మల నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ కుమార్, కిట్టు యాదవ్, అంజి యాదవ్, యువ నాయకుడు శివచారి, అశోక్, మల్లేష్ పాల్గొన్నారు.

### కరీంనగర్‌లో..

నగరంలోని రాంనగర్, మార్కండేయ కాలనీల్లో మున్నూరుకాపు కులస్తులు నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని బోనం ఎత్తుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కొట్టె ప్రభాకర్, మెరుగు స్వప్నశ్రీ, పిట్టల రవీందర్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, నెల్లి నరేష్,పెద్దిగారి తిరుపతి, ఉప్పరి అజయ్, అల్వాల భరత్, కాంపల్లి కీర్తి కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబర్‌పేటలో...

అంబర్‌పేట నియోజకవర్గంలోని గంగానగర్లో అంగరంగ వైభవంగా తొట్టెల ఊరేగింపు పోతరాజుల విన్యాసం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్కే బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని నాలుగవ ఆదివారం రోజున బోనాల పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. సోమవారం బలిగంప కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ వాసులో తదితరులు పాల్గొన్నారు.


శేర్లింగంపల్లి నియోజకవర్గంలో..


షాద్‌నగర్‌లో..


అంతిరెడ్డిగూడెంలో..


కరీంనగర్‌లో..


అంబర్‌పేటలో..

## బోనమెత్తిన భాగ్యనగరం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి సల్లంగ సూడమ్మ అంటూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలు, అమ్మవార్ల ఆలయాలకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరడంతో ఆలయాలు కిటకిటలాడాయి. హైదరాబాద్ పాతబస్తీలో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లాల్‌దర్వాజ సింహవాహినీ మహంకాళి మందిరంతోపాటు అక్కన్న మాదన్న ఆలయం, చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవార్ల దేవాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చారిత్రక లాల్‌దర్వాజాలోని సింహవాహిని మహంకాళి అలయానికి పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.









# కేంద్రమంత్రి కుమారస్వామికి అస్వస్థత



**బెంగళూరు:** కేంద్ర ఉక్కు శాఖ మంత్రి, జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామి అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతుండగా ఆయన ముక్కు నుంచి రక్తం కారడం ఆందోళనకు గురిచేసింది. రక్తం కారడంతో చేతిరుమాలుతో అడ్డుపెట్టారు కుమారస్వామి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పార్టీ నేతలు ఆయనను హుటాహుటిన అపోలో ఆస్పత్రికి తరలించారు. వచ్చే వారం ప్రారంభం కానున్న బీజేపీ-జేడీఎస్ పాదయాత్రకు సంబంధించి బెంగళూరులోని ఓ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుమారస్వామి ముక్కు నుంచి రక్తం కారడం, చొక్కాపై రక్తపు మరకలతో ఉన్న దృశ్యాలు ప్రసార మాధ్యమాలతోపాటు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దృశ్యాలు చూసిన జేడీఎస్ నేతలు, అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం కుమారస్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, కుమారస్వామికి వైద్యులు అందిస్తున్న చికిత్సు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా, ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామి మాట్లాడుతూ.. తన తండ్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నందున ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. తండ్రి తన తీవ్రమైన షెడ్యూల్ కారణంగా విశ్రాంతి తీసుకోలేదని, ఈ సంఘటన వెనుక కారణం కావచ్చని నిఖిల్ చెప్పారు. కాగా, బీజేపీ-జేడీఎస్ సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం ఉదయం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బెంగళూరు నుంచి మైసూర్ వరకు పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 3న ప్రారంభం కానున్న ఈ యాత్ర 10 వరకు కొనసాగింది.




# సిమెంట్ వ్యాపార రంగంలో తీవ్ర పోటీ

- ఫోకస్ పెట్టిన అదానీ గ్రూప్
- బిర్లాలను అధిగమించేందుకు వేగంగా అడుగులు
- బిర్లా గ్రూప్ సైతం అదే స్థాయిలో కొత్త కంపెనీల కొనుగోళ్లు

**విశ్వంభర (బిజినెస్ ప్రతినిధి) :** దేశంలోని సిమెంట్ వ్యాపార రంగంలో పోటీ భారీగా పెరిగింది. ఈ రంగంపై గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ఫోకస్ పెట్టడం వరుసగా అనేక కంపెనీలను కొనుగోలు చేయటం దీనికి నిదర్శనంగా ఉంది. దేశంలో ఈ వ్యాపారంలో మొదటి స్థానంలో ఉన్న బిర్లాలను అధిగమించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న బిర్లా గ్రూప్ సైతం అదే స్థాయిలో కొత్త కంపెనీల కొనుగోళ్లు, ఇతర కంపెనీల్లో మెజారిటీ వాటాల కొనుగోళ్లు చేపడుతోంది. ఈ క్రమంలో అల్ట్రాటెక్ సిమెంట్ డైరెక్టర్ల బోర్డు నేడు జరిగిన సమావేశంలో ఇండియా సిమెంట్స్ కంపెనీలో ప్రమోటర్లు వారి సహచరుల నుంచి 32.72 శాతం ఈక్విటీ వాటాను కొనుగోలు చేయడానికి ఆమోదించినట్లు కంపెనీ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఈ వాటాల కొనుగోలుకు అల్ట్రాటెక్ రూ.3,954 కోట్లను వెచ్చించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఒక్కో షేరును రూ.390కు కొనుగోలు చేయనుంది. అల్ట్రాటెక్ ఇండియా సిమెంట్స్ కంపెనీ షేర్లకు ఆఫర్ చేస్తున్న ధర గడచిన శుక్రవారం స్టాక్ ముగింపు ధర రూ.374.60 కంటే 4.1 శాతం అధికం. జూన్ 2024లో ఒక్కో షేరుకు రూ.268 చొప్పున 22.77 శాతం ఈక్విటీని కొనుగోలు చేసేందుకు కంపెనీ ఇండియా సిమెంట్స్‌లో ఆర్థిక పెట్టుబడి పెట్టిందని పేర్కొంది. ఈ ఆర్థిక పెట్టుబడి తర్వాత కంపెనీలో తమ హోల్డింగ్‌ను విక్రయించాలనుకుంటున్నందున ప్రమోటర్ గ్రూప్ సంప్రదించినట్లు అల్ట్రాటెక్ సిమెంట్స్ బోర్డ్ పేర్కొంది. అల్ట్రాటెక్ పెట్టుబడులు (సేంద్రీయ, అకర్బన) సంవత్సరాలుగా భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా బిల్డింగ్ సొల్యూషన్స్ ఛాంపియన్‌గా మార్చేందుకు రూపొందించబడిందని ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. సిమెంట్ వంటి ప్రధాన రంగంలో ప్రతి పెట్టుబడి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. గృహాలు, రోడ్లు, ఇతర ముఖ్యమైన మౌలిక సదుపాయాల కోసం మన దేశానికి పెరుగుతున్న అవసరాన్ని శక్తివంతం చేస్తూ ప్రజల జీవితాలు, ఆకాంక్షలపై ప్రభావాన్ని చూపిందని బిర్లా పేర్కొన్నారు. ఇండియా సిమెంట్స్ పెట్టుబడులు దేశంలో దక్షిణాది మార్కెట్లకు మరింత ప్రభావవంతంగా సేవలు అందించడానికి అల్ట్రాటెక్‌ని అనుమతిస్తుందని చెప్పారు. ఇది అధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని జోడిస్తుందని పేర్కొన్నారు.

# గర్భధారణ ప్రభుత్వోద్యోగానికి అనర్హత కాదు

## ఢిల్లీ హైకోర్టు తీర్పు




**న్యూఢిల్లీ :** గర్భం దాల్చడం వ్యాధి లేదా అంగవైకల్యం కాదని, మహిళకు ప్రభుత్వోద్యోగాన్ని నిరాకరించడానికి ఇది ఓ కారణం కాకూడదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం శారీరక సామర్థ్య పరీక్షను వాయిదా వేయాలని ఓ గర్భిణి చేసిన విజ్ఞప్తిని తిరస్కరించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)ను మందలించింది. ఆ గర్భిణి పట్ల ఆర్‌పీఎఫ్, కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును దుయ్యబట్టింది. కెరీర్ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు మహిళలకు గల హక్కుకు గర్భం దాల్చడం ప్రాతిపదికపై వివక్ష ఎన్నడూ అడ్డంకిగా మారకూడదని స్పష్టం చేసింది.

# ఎల్జీబీటీక్యూఐ వ్యక్తులు రక్తదానం చేయొచ్చా?

## రేపు సుప్రీం కోర్టులో విచారణ



**న్యూఢిల్లీ, జూలై 28:** ఎల్జీబీటీక్యూఐ (స్వలింగ సంపర్కం చేసే స్త్రీ, పురుషులు, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్లు) వ్యక్తులు రక్తదానం చేయవచ్చా లేదా అనే విషయంపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరపనుంది. రక్తదాతల నిబంధనలు-2017ను సవాల్ చేస్తూ ఢిల్లీకి చెందిన స్వలింగ సంపర్కుడు షరీఫ్ డి రంగ్నేకర్ వేసిన పిల్‌పై కోర్టు తీర్పు వెలువరించనుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం మహిళా సెక్స్ వర్కర్లు, ఎల్జీబీటీక్యూఐ వ్యక్తులు రక్తదానం చేయకూడదు. అయితే ఈ నిబంధనలు వివక్ష పూరితంగా, ఊహాజనితంగా ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. గుడ్డిగా నిషేధం విధించడం సహేతుక కారణం కాదని వాదించారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, గౌరవంతో జీవించే హక్కును ఉల్లంఘించడమేనన్నారు.

# మహోగ్రరూపం దాల్చిన గోదావరి


## వరదముంపులోనే కోనసీమ లంక గ్రామాలు



**విశ్వంభర, ధవళేశ్వరం :** గోదావరి నది మహోగ్ర రూపం దాల్చింది. అఖండ గోదావరి తీరం ప్రమాదకరంగా మారింది. భారీగా వరద జలాల రాకతో ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి 15 లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో లంక గ్రామాలు ముంపులోనే చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. కోనసీమ జిల్లాలో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మరికొన్ని రోజులు వరద ప్రవాహం కొనసాగే అవకాశాలుండటంతో బాధిత గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గోదావరి వరద మళ్లీ పుంజుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో లంక గ్రామాల ప్రజల కష్టాలు అధికమవుతున్నాయి. కొద్ది రోజులుగా వరద నీటితోనే సావాసం చేస్తున్న లంక గ్రామాల వాసులు పెరుగుతున్న ప్రవహంతో బిక్కుబిక్కుమంటున్నారు. సీలేరు, శబరి పరీవాహకాలు భారీ వరద నీటితో గోదావరిలో చేరడంతో వరద ఉధృతి మరికొన్ని ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విలీన మండలాలను వరద నీరు విడవడం లేదు. కోనసీమ జిల్లాలో గౌతమి గోదావరి, వశిష్ట, వైనతేయ గోదావరి పాయలు ఉగ్రరూపం దాల్చాయి. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట, కపిలేశ్వరపురం, అయినవిల్లి, ముమ్మిడివరం, తాళ్లరేవు, రామచంద్రాపురం, కే.గంగావరం, యానాం గౌతవి గోదావరి వరద ముంపులో ఉన్నాయి. క్రమక్రమంగా వరద పెరుగుతోంది. ఉద్యానవన పంటలు , అరటి, బొప్పాయి వంటి పంటలు రోజుల తరబడి నీటిలో నాను తుండతంటో రైతులు ఆందోళన చెందుతు న్నారు. అయినవిల్లి మండలంలోని ఎదురుబిడెంలో పడవ లపైనే గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ముమ్మిడి వరం మండలంలోని గురజాపులంక, లంక ఆఫ్ ఠానెలం క, తాళ్లరేవు మండలం గోవులలంక, రామచంద్రాపురం మండలం శేరులలంక గౌతమి గోదావరి వరద ఉధృతిలో చిక్కుకున్నాయి. పి. గన్నవరం, రాజోలు నియోజకవర్గాలు పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పుచ్చల లంక, కనకాయ లంక, ఇతర లంకల్లోకి వరద నీరు చేరి జనాలు అవస్థలు పడుతున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో దర్శనాలను నిలిపేశారు. బి.దొడ్డవరం, మానేపల్లి, అల్లవరం మండలం బొడసకుర్రు, శివాలయలంక సఖినేటిపల్లి మండలంలోని అప్పునురాముని లంక, రామరాజు లంక, కొత్తలంక, టేకుశెట్టిపాలెం, ఓఎన్జీసీ కాలనీలు వరదలోనే ఉన్నాయి. సఖినేటిపల్లి మండలంలోని కొత్తలంక, మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి కాజ్‌వే, బి.దొడ్డవరం జలదిగ్బంధమయ్యాయి. లంక గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లోని నిర్వాసితులకు నిత్యావసరాలు, తాగునీరు అందజేస్తున్నారు. కోనసీమ జిల్లాలో గౌతమి గోదావరి, వశిష్ట, వైనతేయ గోదావరి పాయలు ఉగ్రరూపం దాల్చాయి. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట, కపిలేశ్వరపురం, అయినవిల్లి, ముమ్మిడివరం, తాళ్లరేవు, రామచంద్రాపురం, కే.గంగావరం, యానాం గౌతవి గోదావరి వరద ముంపు లో ఉన్నాయి. క్రమక్రమంగా వరద పెరుగుతోంది. ఉద్యానవన పంటలు , అరటి, బొప్పాయి వంటి పంటలు రోజుల తరబడి నీటిలో నానుతుండతంటో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినవిల్లి మండలంలోని ఎదురుబిడెంలో పడవలపైనే గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ముమ్మిడివరం మండలంలోని గురజాపులం క, లంక ఆఫ్ ఠానెలంక, తాళ్లరేవు మండలం గోవులలం క, రామచంద్రాపురం మండలం శేరులలంక గౌతమి గోదావరి వరద ఉధృతిలో చిక్కుకున్నాయి. పి. గన్నవరం, రాజోలు నియోజకవర్గాలు పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పుచ్చల లంక, కనకాయ లంక, ఇతర లంకల్లోకి వరద నీరు చేరి జనాలు అవస్థలు పడుతున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో దర్శనాలను నిలిపేశారు. బి.దొడ్డవరం, మానేపల్లి, అల్లవరం మండలం బొడసకుర్రు, శివాలయ లంక సఖినేటిపల్లి మండలంలోని అప్పునురాముని లంక, రామరాజు లంక, కొత్తలంక, టేకుశెట్టిపాలెం, ఓఎన్జీసీ కాలనీలు వరదలోనే ఉన్నాయి. సఖినేటిపల్లి మండలం లోని కొత్తలంక, మామిడికుదురు మండలంలోని అప్పన పల్లి కాజ్‌వే, బి.దొడ్డవరం జలదిగ్బంధమయ్యాయి. లంక గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారు లు పడవలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లోని నిర్వాసితులకు నిత్యావసరాలు, తాగునీరు అందజేస్తున్నారు.

# మేమంతా ఆమె మాట విన్నాం

## ప్రతి ముఖ్యమంత్రికి కేటాయించిన సమయం ఇచ్చాం
## మమతా బెనర్జీ ఆరోపణలపై నిర్మల సీతారామన్ స్పందన..




**విశ్వంభర, ఢిల్లీ :** నీతి ఆయోగ్ సమావేశంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నీతి ప్రసంగాన్ని ముగించేలోపే మైక్ మ్యూట్ చేసినట్లు ఆరోపణలు రావడంతో రాజకీయ దుమారం రేగింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎక్కువసేపు మాట్లాడటానికి అనుమతించారని, అయితే ఐదు నిమిషాల తర్వాత తనను మాట్లాడకుండా ఆపారని ఆమె పేర్కొన్నారు. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ప్రభుత్వం రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ మిత్రపక్షం చంద్రబాబు నాయుడు 20 నిమిషాలు మాట్లాడేందుకు అనుమతించారని ఆమె పేర్కొన్నారు. "నేను సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చాను. (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి) చంద్రబాబు నాయుడుకు మాట్లాడేందుకు 20 నిమిషాల సమయం ఇచ్చారు. అస్సాం, గోవా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు 10-12 నిమిషాలు మాట్లాడారు. కేవలం ఐదు నిమిషాల తర్వాత నన్ను మాట్లాడకుండా ఆపారు. ఇది అన్యాయం, నేను మాత్రమే ఇక్కడ సమావేశానికి హాజరయ్యాను ఎందుకంటే సహకార సమాఖ్యను బలోపేతం చేయాలి" అని మమతా బెనర్జీ చెప్పారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఇతర రాష్ట్రాలపై ప్రభుత్వం ఎందుకు వివక్ష చూపిందని ప్రశ్నించారు. ప్రతి ముఖ్యమంత్రి మాట్లాడేందుకు తగిన సమయం కేటాయించారని నిర్మలా సీతారామన్ అన్నారు. తన మైక్ ఆఫ్ చేశారని బెనర్జీ చేసిన వాదన పూర్తిగా అబద్ధమని ఆమె అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం మమతా బెనర్జీ హాజరయ్యారు. మేమంతా ఆమె మాట విన్నాం. ప్రతి ముఖ్యమంత్రికి కేటాయించిన సమయం ఇచ్చాం. "తన మైక్ ఆఫ్ చేసిందని ఆమె మీడియాలో చెప్పారు. అది పూర్తిగా అబద్ధం. ప్రతి సీఎంకు మాట్లాడేందుకు తగిన సమయం ఇచ్చారు" అని ఆమె అన్నారు. బెంగాల్ సీఎం ఎక్కువ సమయం కోరలేదని నిర్మలా సీతారామన్ అన్నారు. "మైక్ ఆన్‌లో ఉన్నప్పటికీ, ఆమె సమయం ముగిసిపోయిందని గుర్తుచేస్తే, మరికొందరు ముఖ్యమంత్రులు మాట్లాడినట్లుగా ఆమె మాట్లాడటం కొనసాగించమని ఆమె అభ్యర్థించవచ్చు. కానీ ఆమె దానిని సాకుగా ఉపయోగించుకుంది" అని సీతారామన్ అన్నారు. నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పశ్చిమ బెంగాల్ సీఎం మైక్రోఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని ప్రచారం జరుగుతోంది. ఈ వాదన తప్పుదారి పట్టిస్తోంది. ఆమె మాట్లాడే సమయం ముగిసిందని గడియారం మాత్రమే చూపించింది. గుర్తు చేయడానికి గంట కూడా మోగలేదు. అది" అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (%ూ×దీ) శ% లో ఒక పోస్ట్‌లో పేర్కొంది. మమతా బెనర్జీ మాట్లాడే అవకాశం భోజనం తర్వాత మాత్రమే ఉంటుంది. అయితే ముఖ్యమంత్రి నుంచి అధికారిక అభ్యర్థన మేరకు ఆమెకు ఏడవ స్పీకర్‌గా "అకామిడేషన్" కల్పించారని వివరించింది.

# పేదల సొమ్ము కాంగ్రెస్ స్వాహా

## సిద్ధరామయ్య అవినీతికి వ్యతిరేకంగా పాదయాత్ర




**విశ్వంభర, ఢిల్లీ :** ఎస్టీల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్వాహా చేశారని విపక్ష నేత ఆర్ అశోక ఆరోపించారు. ముడా స్కామ్, వాల్మీకి స్కామ్‌లన్నింటిలో సిద్ధరామయ్య హస్తం ఉందని అన్నారు. సిద్ధరామయ్య అవినీతికి వ్యతిరేకంగా తాము పాదయాత్ర చేపడతామని వెల్లడించారు. ఆర్ అశోక ఆదివారం బెంగళూర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పేదలకు ఉద్దేశించిన సొమ్మును కర్నాటక కాంగ్రెస్ సర్కార్ లూటీ చేస్తోందని మండిపడ్డారు. కర్నాటకలో భారీ కుంభకోణాలు వెలుగుచూశాయని, ఈ స్కామ్‌లన్నింటిలో సిద్ధరామయ్య చేతివాటం చూపారని ఆరోపించారు. తాము చేపట్టే పాదయాత్రలో బీజేపీ జాతీయ నాయకులు, జేడీఎస్ నేతలు పాల్గొంటారని ఆయన వివరించారు. కాగా, కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ అంతకుముందు ఆరోపించారు. ముడా స్కామ్‌లో స్వయంగా కర్నాటక సీఎం లబ్ధిదారుడని, వాల్మీకి స్కామ్‌లోనూ అవినీతి చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో బీజేపీ ఎంపీలు ఈ అంశాలను లేవనెత్తారని, కాంగ్రెస్ సభ్యులు అవినీతి కర్నాటక సర్కార్ కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఈ స్కామ్‌ల్లో కాంగ్రెస్ హైకమాండ్‌కు వాటాలు అందుతున్నాయని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో ఈ స్కామ్‌లపై బీజేపీ ఎంపీలను మాట్లాడనీయకుండా కాంగ్రెస్ ఎంపీలు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ అంశంపై సీబీఐ విచారణకు తాము డిమాండ్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాగా, కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన అనంతరం అవినీతి రాజ్యమేలుతోందని, రాష్ట్రం కుంభకోణాల మయ-మైందని బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది ఆరోపించారు.



# బుల్ జోరులో మార్కెట్లు

**విశ్వంభర (బిజినెస్):** దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ జోరు కొనసాగుతోంది. వాస్తవానికి భారత ఈక్విటీ మార్కెట్లు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాల వద్ద కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే బడ్జెట్ తర్వాత ఎక్కడ పెట్టుబడులు కొనసాగించాలనే ఆందోళనలు, గందరగోళం చాలా మంది భారతీయ ఇన్వెస్టర్లను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ ఏంజెల్ వన్ రీసెర్చ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమర్ డియో సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ తర్వాత ఏఏ రంగాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు ఎలా ఉండనుంది వంటి విషయలపై స్పందించారు. ఇది వాస్తవానికి గందరగోళంలో ఉన్న లక్షలాధిమంది ఇన్వెస్టర్లకు మార్గనిర్దేశకం చేయవచ్చు. సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు వారికి క్లారిటీ ఇవ్వవచ్చని తెలుస్తోంది. బడ్జెట్ 2024 సమాజంలో ఉద్యోగాల కొరత, తగ్గుతున్న డిమాండ్ వంటి కీలక అంశాలపై ఆసారి దృష్టి సారించిందని డియో సింగ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో బడ్జెట్ అగ్రికల్చర్ రంగం, అఫోర్డబుల్ హౌసింగ్, స్కిల్లింగ్, ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహకాలను అందించే దిశగా సాగింది. ఇది కోట్ల మంది మధ్యతరగతి ఆదాయ బ్రాకెట్ ఫ్యామిలీల సమస్యలకు కొంత పరిష్కారాన్ని అందించనుందని తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ ఎఫ్‌ఎంసీజీ, ఇన్ ఫ్రా, మ్యానుఫ్యాక్చరింగ్, హౌసింగ్, అగ్రి, పవర్ సెక్టార్ ప్రధానంగా లాభపడవచ్చని సింగ్ అంచనా వేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ యాజమాన్యంలోని పవర్, ఎనర్జీ, రైల్వే, డిఫెన్స్, బ్యాంకింగ్ సహా మరిన్ని రంగాలు మంచి ఆర్డర్ బుక్ చూడవచ్చని తెలుస్తోంది. మౌలిక సదుపాయాలు, తయారీ రంగంపై ప్రభుత్వం దృష్టి సారించడంలకు పరివర్తన ప్రయాణంలో గణనీయంగా సహాయపడింది. మేక్-ఇన్-ఇండియాపై దృష్టి పెట్టడం కూడా వృద్ధికి తోడ్పడింది. హైవేలు, పవర్, ఓడరేవులు, విమానాశ్రయాల నిర్మాణ పరంగా మౌలిక సదుపాయాలపై ఒత్తిడి కూడా ప్యాక్‌కి సహాయపడింది. ప్రస్తుతం దేశీయ ఈక్విటీ మార్కెట్లలో బుల్ రన్ కొనసాగుతున్న వేళ పెట్టుబడికి ఇప్పటికీ ఆకర్షనీయమైన రంగాల జాబితాలో ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా, ఇన్‌ఫ్రా, హౌసింగ్ వంటివి కొనసాగుతున్నాయని సింగ్ పేర్కొన్నారు. అలాగే భారతీయ ఈక్విటీలు, మొత్తం ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలికంగా మంచి పనితీరును కనబరుస్తుందని అంచనా వేశారు. బెంచ్‌మార్క్ సూచీల గత చారిత్రక రాబడిని బట్టి చూస్తే, గత రెండు దశాబ్దాలుగా14-15 శాతం వార్షిక రాబడికి దగ్గరగా ఉందని, ఇది ఈక్విటీలు ఇతర అసెట్ క్లాస్‌లను అధిగమించాయని అన్నారు.



# పి-4 విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి

- అధిక జనాభాను బలంగా మార్చుకోవాలి
- గ్రామం నుంచే మౌలిక వసతుల కల్పన ప్రారంభించాలి
- తయారీ రంగానికి భారత్‌ను హబ్‌గా మార్చాలి

**విశ్వంభర, అమరావతి :** వికసిత భారత్-2047 లక్ష్యసాధనకు అవసరమైన రోడ్ మ్యాప్ తయారీ కోసం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శనివారం జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ తరఫున తన వాణి వినిపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంతో దేశం ఎలా లబ్ధి పొందిందో అందరూ చూశారని చెప్పారు. ఇప్పుడు ప్రజలనూ భాగస్వాములను చేయాలంటూ సీఎం చంద్రబాబు పీ-4 విధానాన్ని నీతి ఆయోగ్ పాలక మండలి ఎదుట ఉంచారు. దేశంలో సంపూర్ణ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజా భాగస్వామ్యం "పి-4" విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. నదుల అనుసంధానాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, తయారీ రంగ హబ్‌గా దేశాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. అధిక జనాభాను బలంగా మార్చుకోవాలన్నారు. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు వివిధ అంశాలపై ప్రతిపాదనలు చేశారు. భారత్ ఆర్థికంగా 3వ స్థానానికి చేరుకోవడం ఖాయమైనందున 2047 నాటికి రెండు లేదా ఒకటో స్థానానికి ఎదిగేలా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

### ఏపీలో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తాం..

ఈ విధానంతో పేదరిక నిర్మాలన సాధ్యమవుతుందని చంద్రబాబు అన్నారు. దేశంలో తొలి పది శాతం మంది సంపన్నులు అట్టడుగున ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి బాగుకు బాటలు వేసేలా విధాన రూపకల్పన చేయాలన్నారు. తద్వారా పేదరిక నిర్మూలన వేగంగా జరుగుతుందని వివరించారు. ఏపీలో తాము ఈ విధానాన్ని అమల్లోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. ప్రధాని మోదీ గత పదేళ్లలో ఆర్థిక, రాజకీయ సుస్థిరత తీసుకొచ్చి, అన్ని రంగాల్లో మన దేశం ప్రపంచస్థాయి దేశాలతో పోటీపడే శక్తినిచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు బలమైన బ్రాండింగ్ కల్పించారని కొనియాడారు. పదేళ్ల ప్రధాని కష్టాన్ని దేశానికి అనుకూలంగా మార్చుకొనే సమయం వచ్చిందన్నారు. రాష్ట్రాలు తమవంతు పాత్ర పోషించి, సద్వినియోగం చేసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఆంధ్రప్రదేశ్ చాలా ఆసక్తితో ఉంది..

వికసిత భారత్ ప్రయాణంలో భాగస్వామి కావడానికి ఆంధ్రప్రదేశ్ చాలా ఆసక్తితో ఉందని చంద్రబాబు చెప్పారు. పీ-4, నదుల అనుసంధానం, గ్రామీణ ప్రాంతాల నుంచి అన్ని చోట్లకు రహదారుల అనుసంధానం, నైపుణ్య గణన, ప్రపంచంలోనే అత్యుత్తమ ఉత్పత్తులు తయారీ గురించి చంద్రబాబు ప్రస్తావించారు.

### నదుల అనుసంధానం చేయాలి...


రైతుల ఆదాయాన్ని పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి వీలుగా నదుల అనుసంధానం చేయాలని చంద్రబాబు సూచించారు. పట్టిసీమ ద్వారా జరిగిన నదుల అనుసంధాన ఫలితాన్ని ఏపీ రైతులు ఆస్వాదిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం మిషన్‌మోడ్‌లో స్వర్ణచతుర్భుజి ద్వారా దేశవ్యాప్తంగా రహదారుల అనుసంధానం చేసినట్లుగానే ఇప్పుడు నదుల అనుసంధానానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఇందుకోసం జాతీయస్థాయి రోడ్ మ్యాప్ రూపొందించాలని చెప్పారు. జలాలపరంగా భవిష్యత్‌లో ఎదుర్కొనే సమస్యలనూ పరిష్కరించవచ్చన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లకు రహదారుల్ని అనుసంధానం చేయాలని చంద్రబాబు సూచనలు చేశారు.

### 100 శాతం అమలయ్యేలా కృషి చేయాలి

గ్రామం నుంచే మౌలిక వసతుల కల్పన ప్రారంభిస్తే మనం అనుకున్న వృద్ధి రేటు సాధించగలమని చంద్రబాబు అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని చెప్పారు. ప్రతి అంశాన్నీ వ్యక్తి, కుటుంబం, గ్రామ, పట్టణ, నగర, రాష్ట్రస్థాయిల్లో చూసి వాటన్నింటినీ సంతృప్తికర స్థాయిలో 100 శాతం అమలయ్యేలా కృషి చేయాలని చంద్రబాబు వివరించారు. తయారీ రంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు చేరే సామర్థ్యం భారత్‌కు ఉందన్న చంద్రబాబు అందుకోసం ప్రతి ఉత్పత్తి తయారీలో పర్‌ఫెక్షన్‌కు వెళ్లాలన్నారు. పరిశ్రమలు వస్తే ఎంత పెట్టుబడి పెడతారనే దానితోపాటు ఎంత మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తున్నారనేది కూడా చూసుకోవాలని చెప్పారు. ప్రపంచస్థాయి అవసరాలను తీర్చే అత్యుత్తమ ఉత్పత్తుల తయారీ రంగానికి భారత్‌ను హబ్‌గా మార్చాలని చంద్రబాబు వెల్లడించారు. హరిత ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్‌కూ ప్రాధాన్యం ఇవ్వాలన్న చంద్రబాబు వనరులను సద్వినియో గం చేసుకుంటే అది సాధ్యమేనన్నారు. అధిక జనాభాను బలహీనతగా కాకుండా బలంగా మలుచుకోవడానికి డెమోగ్రఫిక్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిసారించాలని సూచించా రు. దేశానికి యువత అతి పెద్ద వనరని, దాన్ని సక్ర మంగా ఉపయోగించుకుంటే అద్భుతాలు సాధించవచ్చని చెప్పారు. దేశ మానవ, సహజవనరులను సక్రమంగా ఉపయోగించుకుంటే 50 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనేది అసాధ్యమేమీ కాదని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

# వరద బాధిత కుటుంబాలకు రూ.3వేలు ఆర్థిక సహాయం

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో దాదాపు మూడు వారాల నుంచి జోరుగా వానలు కురుస్తున్నాయి. రెండు రోజుల నుంచి మాత్రమే సూర్యుడు కనిపిస్తున్నాడంటే రాష్ట్రం మెంత్తం ఏవిధంగా ముసురుకుందో అర్థం చేసుకోవచ్చు. గోదావరిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండటా భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వదర నీరు చేరుతోంది. జూరాల నుంచి మూడు లక్షల క్యూసెక్కుల నీరు, సంకేశుల నుంచి 1.40 లక్షల క్యూసెక్కులనీరు వచ్చి చేరుతోంది. దీంతో ఈనెల 30వ తేదీన శ్రీశైలం గేట్లు తెరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



### బాధితులకు రూ.3వేలు..

వర్షాలను, వరదను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక ప్రకటన చేశారు. వరద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని, జిల్లా మంత్రులు వెంటనే వారిని పరామర్శించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ఒక్కింటికి రూ.3వేల చొప్పున ఆర్థిక సహాయం చేయాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, పంట నష్టం వివరాలను అధికారులు వెంటనే నమోదు చేయాలన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహం వల్లే ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు.

### జోరుగా కురుస్తున్న వానలు..

ఏపీ, తెలంగాణలో జోరుగా వానలు కురుస్తూనే ఉన్నాయి. ఏపీలో మరో రెండురోజులపాటు వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో ఇప్పటికే ఒక అల్పపీడనం ఏర్పడగా, ఆగస్టు మొదటివారంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, నంద్యాల, ప్రకాశం, పల్నాడు, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురవనున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఉన్న అల్పపీడనం ఒడిసా దగ్గర తీరం దాటే అవకాశం ఉంది. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నాలుగు బృందాలను ఏర్పాటు చేసింది.

# జగనన్నా.. ఇంత పిరికితనమా..

- సిగ్గు.. సిగ్గు అంటూ విమర్శలు
- ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా చేయాలని డిమాండ్
- జగనన్నకు మోసాలు ఆయనకు కొత్త కాదన్న షర్మిల



**విశ్వంభర, అమరావతి :** అసెంబ్లీకి వెళ్లని జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వెళ్లని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కూడా పదవులకు రాజీనామా చేయాలన్నారు. సిగ్గు..సిగ్గు.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతా అనడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ధ్వజమెత్తారు. ఇంతకుముంచిన పిరికితనం, చేతగానితనం, అహంకారం ఎక్కడ కనపడవు, వినపడవని విమర్శించారు. మోసం చేయడం జగన్‌కు కొత్తేమీ కాదని, కానీ ఓట్లేసి గెలిపించిన ప్రజలను ఇంత దారుణంగా మోసం చేయడం, అవమానించడం ఆయనకే చెల్లిందని మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం దివాళాకోరుతనంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అని మెంబర్ ఆఫ్ మీడియా అసెంబ్లీ కాదని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక కావడానికా లేక మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా అని ప్రశ్నించారు. నిండు సభలో అధికార పక్షం శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే, తాపీగా ప్యాలస్‌లో కూర్చుని మీడియా మీట్‌లు పెట్టడానికి ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకోలేదని ట్వీట్ చేశారు. ఐదేళ్ల అవినీతి, దోపిడీ పాలనతో రాష్ట్రాన్ని జగన్ రెడ్డి అప్పులకుప్పగా మార్చేశారని ప్రభుత్వం చెబుతుంటే, ఆన్ రికార్డు సమాధానం ఇచ్చుకునే బాధ్యత లేదా అని నిలదీశారు. ప్రజలకు అన్యాయం జరిగితే అధికార పక్షాన్ని ఫ్లోర్ అఫ్ ది హౌస్‌లో ప్రశ్నించే బాధ్యత లేదా అని షర్మిల ప్రశ్నలు సంధించారు. అసెంబ్లీకి వెళ్లనని చెప్పే నాయకుడు ప్రతిపక్ష హోదాకే కాదు, ఎమ్మెల్యే హోదాకు కూడా అర్హులు కాదన్నారు. బడికి వెళ్లని పిల్లవాడికి టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తారని, ఆఫీసుకు పోననే పనిదొంగను వెంటనే పనిలోంచి పీకేస్తారని, ప్రజాతీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి పోనంటూ గౌరవ సభను అవమానించిన వాళ్లకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పోనప్పుడు, ఆఫ్రికా అడవులకు పోతారో, అంటార్కిటికా మంచులోకి పోతారో ఎవరికి కావాలన్నారు. అసెంబ్లీకి పోని జగన్ అండ్ కో తక్షణం తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని షర్మిల రెడ్డి ట్వీట్ చేశారు.






# పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ బోణీ

- షూటింగ్ లో కాంస్యం సాధించిన మనుబాకర్
- పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్ గా చరిత్ర
- ఒలింపిక్స్ లో భారత్ కు తొలి పతకం



**విశ్వంభర, పారిస్ :** పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు తొలి పతకం దక్కింది. యువ షూటర్ మనుబాకర్ 10మీ ఎయిర్ పిస్టల్ లో కాంస్య పతకం సాధించింది. ఒలింపిక్స్ లో షూటింగ్లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించింది. ఫైనల్లో మను బాకర్ 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా షూటర్లు ఓహ్ యే జిన్ (243.2పాయింట్లు) స్వర్ణం, కిమ్ యేజే(241.3 పాయింట్లు) రజతం గెలిచారు. మరోవైపు పురుషుల 10మీ ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్లో అర్జున్ జబుతా అదరగొట్టాడు. అతడు 630.1 స్కోరుతో ఏడో స్థానంలో నిలిచి ఫైనల్ కు అర్హత సాధించాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ సందీప్ సింగ్ (629.3 స్కోరు) 12వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల 10మీ ఎయిర్ పిస్టల్ ఫైనల్ సోమవారం మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభంకానుంది.

### ఒలింపిక్స్ పతకాలు సాధించిన భారత షూటర్లు..

- రాజ్యవర్ధన్ రాథోడ్ - మెన్స్ డబుల్ ట్రాప్ - 2000 ఏథెన్స్ ఒలింపిక్స్ - రజతం
- అభినవ్ బింద్రా - 10 మీ. ఎయిర్ రైఫిల్ - 2008 బీజింగ్ - స్వర్ణం
- గగన్ నారంగ్ - 10 మీ. ఎయిర్ రైఫిల్ - 2012 లండన్ - కాంస్యం
- విజయ్ కుమార్ - మెన్స్ 25 మీ. రాపిడ్ ఫైర్ పిస్టల్ - 2012 లండన్ - రజతం
- మను భాకర్ - ఉమెన్స్ 10 మీ. ఎయిర్ పిస్టల్ - 2024 పారిస్ - కాంస్యం

### పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం..

మిగతా అందరూ విఫలమైనా.. మను బాకర్ ఆశలు నిలిపింది.. మొదటి రోజే మెరిసినా ఆమె రెండో రోజు పతకం కొల్లగొట్టింది. నిలకడైన ప్రదర్శనతో భారత్ కు పారిస్ ఒలింపిక్స్‌లో తొలి పతకం అందించింది. శనివారం క్వాలిఫికేషన్‌లో మను 580 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఈ ఈవెంట్ ఫైనల్ ఆదివారం జరిగింది. ఇదే ఈవెంట్లో మరో భారత షూటర్ రిథమ్ సాంగ్వాన్ 15వ స్థానంలో నిలిచి తప్పుకొంది. ఈమె 517 పాయింట్లు స్కోర్ చేసింది. అయితే, 582 పాయింట్లతో హంగేరి షూటర్ వెరోనికా మేజర్ టాప్ లో నిలిచింది. నిన్నటి రోజున తొలి సిరీస్ లో పది షాట్లకు 97 పాయింట్లు స్కోర్ చేసిన మను.. తర్వాత నిలకడైన ప్రదర్శనతో 27 ఇన్నర్ పదులు షూట్ చేసింది.

### పురుషుల ఎయిర్ ఫిస్టల్ లో ఆదిలోనే విఫలం..

పారిస్ ఒలింపిక్స్ పురుషుల 10మీ ఎయిర్ పిస్టల్ లో సరబ్‌జ్యోత్, అర్జున్ బరిలో దిగినా మొదట్లోనే విఫలమయ్యారు. అయితే, సరబ్ జ్యోత్ త్రుటిలో తుది పోరుకు దూరమయ్యాడు. ఎనిమిది మందికి ఫైనల్ చేరే అవకాశముండగా.. సరబ్‌జిత్ 577 పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. జర్మనీకి చెందిన రాబిన్స్‌తో సమానంగా స్కోర్ చేసినా.. ఎక్కువ ఇన్నర్ పదులతో రాబిన్స్ ముందంజ వేశాడు. రాబిన్స్ 17 ఇన్నర్ పదులు షూట్ చేయగా.. సరబ్ 16 దగ్గరే ఆగిపోయాడు. కాగా, అర్జున్ చీమా 174 పాయింట్లతో 18వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక 10 మీ ఎయిర్ రైఫిల్ ఈవెంట్లో రెండు భారత జట్లూ క్వాలిఫికేషన్ దశలోనే నిష్క్రమించాయి. రమిత జిందాల్-అర్జున్ బబుతా జోడీ 628.7 పాయింట్లతో ఆరో స్థానంలో, ఇలవెనిల్ వలరివన్- సందీప్ సింగ్ ద్వయం (626.3) 12వ స్థానంతో సరిపెట్టుకుంది. పతకం సాధించే ఫైనల్స్ కు చేరాలంటే జట్లు టాప్-4లో నిలవాలి.

### తొలి భారత మహిళా షూటర్‌గా చరిత్ర పుటల్లోకి..




పారిస్‌లో కాంస్యం సాధించడం ద్వారా ఒలింపిక్స్ షూ టింగ్ లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూ టర్ గా మను బాకర్ చరిత్ర సృష్టించింది. కాగా, టోక్యోలో జరిగిన 2020 ఒలింపిక్స్ (కరోనా కారణం గా 2021లో జరిగాయి) తొలి రోజే వెయిట్ లిఫ్టర్ చాను రజతం సాధించింది. పారిస్ లో మాత్రం రెండో రోజు పతకం లభించింది. అప్పట్లో బోణీ భారత బృం దానికి, అభిమానులకు గొప్ప ఊపునిచ్చింది. ఈసారి ఆ అవకాశం లేదా? అని అభిమానులు నిరుత్సాహ పడుతుండగా మను అదరగొట్టింది. తోటివారంతా విఫలమైన వేళ.. చక్కటి ప్రదర్శనతో ఫైనల్ కు వచ్చింది. షూటింగ్ లో భారత్ కు అసలు పతకాల ఆశల్లేవ్. కానీ.. మను వాటికి ఊపిరి పోసింది. మను భాకర్ ఇప్పటికే తొమ్మిది సార్లు వరల్డ్ కప్ మెడల్స్ సాధించింది. షూటింగ్ విభాగంలో ఒలింపిక్ పతకం సాధించిన ఐదో భారత వ్యక్తిగా మను రికార్డుల్లోకి ఎక్కింది. క్వాలిఫికేష న్లో మను భాకర్ అత్యధికంగా 27 సార్లు పర్ఫెక్ట్ స్కోర్లు నమోదు చేయడం గమనార్హం. వ్యక్తిగత విభాగంలో గత 20 ఏళ్లలో ఒలింపిక్ ఫైనల్ చేరిన తొలి భారత అథ్లెట్ గా కూడా మను బాకర్ రికార్డు క్రియేట్ చేసింది. ఇంత కు ముందు సుమా షిరూర్.. 2004లో జరిగిన ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్ కుత చేరింది.

# శ్రీలంక కొంపముంచిన వర్షం
# సిరీస్ భారత్ సొంతం!




**విశ్వంభర :** శ్రీలంక పర్యటనలో టీమిండియా జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారత్ విజయం సాధించింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్ధతిన 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌కు పదే పదే వర్షం అంతరాయం కలిగించగా.. అంపైర్లు భారత్ లక్ష్యాన్ని 8 ఓవర్లలో 78 పరుగులకు కుదించారు. ఈ గెలుపుతో టీమిండియా మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఈ సిరీస్ విజయంతో టీమిండియా నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బోణీ కొట్టారు.

### చెలరేగిన బౌలర్లు..

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 161 పరుగులు చేసింది. కుశాల్ పెరీరా(34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీతో రాణించగా.. పాతుమ్ నిస్సంక (24 బంతుల్లో 5 ఫోర్లతో 32) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్(3/26) మూడు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్(2/24), అక్షర్ పటేల్(2/30), హార్దిక్ పాండ్యా(2/23) రెండేసి వికెట్లు తీసారు. అనంతరం భారత్ 6.3 ఓవర్లలోనే 3 వికెట్లకు 81 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. యశస్వి జైస్వాల్(15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30), సూర్యకుమార్ యాదవ్(12 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26), హార్దిక్ పాండ్యా(9 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) రాణించారు. శ్రీలంక బౌలర్లలో మహీష్ తీక్షణ, వానిందు హసరంగా, మహీష్ పతీరణ తలో వికెట్ తీసారు.

### వర్షం అంతరాయం..

162 పరుగుల లక్ష్యచేధనకు దిగిన భారత్ మూడు బంతులు ఆడి 6/0 పరుగులు చేయగానే వర్షం అంతరాయం కలిగించింది. దాంతో గంటన్నరపాటు ఆటకు అంతరాయం కలిగింది. వర్షం ఆగిపోవడంతో మ్యాచ్ తిరిగి ప్రారంభమవ్వగా.. అంపైర్లు భారత్ లక్ష్యాన్ని కుదించారు. డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ లక్ష్యాన్ని 8 ఓవర్లలో 78 పరుగులుగా నిర్ణయించారు.

### నిరాశపర్చిన సంజూ శాంసన్..

ఆట తిరిగిన ప్రారంభమైన వెంటనే భారత్‌కు బిగ్ షాక్ తగిలింది. సంజూ శాంసన్(0) తీక్షణ బౌలింగ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరమవ్వడంతో అతని స్థానంలో తుది జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్ తీవ్రంగా నిరాశపరిచాడు. క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్‌తో యశస్వి జైస్వాల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడటంతో భారత్ నాలుగు ఓవర్లలోనే 50 పరుగులు పూర్తి చేసుకుంది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మతీష పతీరణ విడదీసాడు. ఊరించే బంతితో సూర్యకుమార్ యాదవ్‌ను క్యాచ్ ఔట్‌గా బోల్తా కొట్టించాడు. హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు రాగా.. యశస్వి జైస్వాల్ హసరంగా బౌలింగ్‌లో ఓ భారీ సిక్సర్ బాది.. మరుసటి బంతికే క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి రిషభ్ పంత్ రాగా.. హార్దిక్ పాండ్యా ఓ భారీ సిక్సర్‌తో పాటు రెండు బౌండరీలు బాది విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# ఓ పక్క ఒలింపిక్స్.. మరోవైపు పవర్ కట్

### పారిస్‌లో మరోసారి గందరగోళం

**విశ్వంభర, పారిస్:** ఒలింపిక్స్ ఆతిథ్యమిస్తున్న పారిస్‌లోని పలు ప్రాంతాలు అంధకారంలోకి కూరుకుపోయినట్లు వార్తలొచ్చాయి. చాలా మంది స్థానికులు, మీడియా సభ్యులు దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వీడియోల్లో చిమ్మచీకట్లో ఉన్న పారిస్ నగరం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సిసిటివి దృశ్యాల్లో కూడా నగరంలో కరెంటు కట్ అయినట్లు తెలుస్తోంది. ఒలింపిక్స్‌లో డీజిల్ జనరేటర్ల వినియోగాన్ని నిలిపివేశారు. పబ్లిక్ లైన్లకే క్రీడీ వేదికను అనుసంధానించినట్లు ఇప్పటికే కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ వేడుకలకు ముందు దాడుల కారణంగా రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. దాదాపు 8లక్షల మంది దీనికి ప్రభావితం అయ్యారు. ఇక పారిస్‌లో వర్షాల కారణంగా చాలా క్రీడలు వాయిదా పడటమో..రద్దు కావడమో జరిగాయి. వీటిల్లో జకోవిచ్, అల్కరజ్ వంటి వారు ఆడాల్సిన టెన్నిస్ మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. స్విమ్మింగ్ ట్రైయాథ్లాన్ తొలి ట్రైనింగ్ సెషన్‌ను ఒలింపిక్స్ నిర్వాహకులు రద్దు చేశారు. నీటి నాణ్యతకు సంబంధించి సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నాం. ట్రైయాథ్లాన్ సన్నద్ధతను రద్దు చేస్తున్నాం. అథ్లెట్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నాం. సెన్ నది నీటి నాణ్యతను మరోసారి పరీక్షిస్తాం. ఎప్పుడు అనుమతి ఇస్తామనేది ఇప్పుడే చెప్పలేం అని నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు.



# టోల్ ప్లాజాలు లేకుండానే టోల్ కట్

- త్వరలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు
- టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్‌కు చెక్
- హైవేలపై ఏర్పాటు చేసిన కెమెరాల ఆధారంగా ఉపగ్రహానికి వాహన సమాచారం
- ఈ విధానం ప్రపంచంలోనే మొదటిదన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**విశ్వంభర (సాంకేతికం):** త్వరలోనే దేశంలోని అన్ని టోల్ ప్లాజాలను మూసివేయనున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ స్థానంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని అమలు చేయబోతున్నట్లు తెలిపారు. హైవేలపై ప్రయాణించాలంటే కచ్చితంగా టోల్ చెల్లించాల్సిందే. ఇందుకోసం లైన్‌లో వెయిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఒకప్పుడు డబ్బులు చెల్లించే విధానం నుంచి నేడు ఫాస్ట్‌ట్రాక్‌కి అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాము. అయితే ఇకపై అసలు టోల్ ప్లాజాలే ఉండవు. అదేంటి టోల్ ప్లాజాలు లేకపోతే టోల్ ఎలా వసూలు చేస్తారనే సందేహం కచ్చితంగా వస్తుంది కదూ! దేశంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. అసలు ఎలాంటి టోల్ ప్లాజాలు లేకుండానే వాహనదారుల బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు టోల్ రూపంలో కట్ అవుతాయి. త్వరలోనే దేశంలోని అన్ని టోల్ ప్లాజాలను మూసివేయనున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ స్థానంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని అమలు చేయబోతున్నట్లు తెలిపారు. ఇంతకీ శాటిలైట్ బేస్డ్ టోల్ కలెక్షన్ సిస్టమ్ అంటే ఏంటి.? అసలు ఇది ఎలా పనిచేస్తుంది.? ఈ విధానంలో డబ్బులు ఎలా కట్ అవుతాయో ఇప్పుడు తెలుసుకుందాం..

ప్రస్తుతం టోల్ చెల్లించాలంటే వాహనదారులు టోల్ ప్లా జాల వద్ద వాహనాలు నిలిపి లైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు కూడా ఉంటాయి. అయితే శాటిలైట్ ఆధారిత టోల్ కలెక్షన్ సిస్టమ్‌లో, కారులో ఇన్‌స్టాల్ చేసిన ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా టోల్ కట్ అవుతుంది. శాటిలైట్ ఆటోమేటిక్‌గా కారు ప్రయాణించిన దూరాన్ని లెక్కిస్తుంది. దీని ఆధారంగా ఎంత టోల్ కట్ అవ్వాలో అంత ఆటోమెటిక్‌గా కట్ అవుతుంది. ఈ వ్యవస్థను శాటిలైట్ బేస్డ్ టోల్ కలెక్షన్ సిస్టమ్ లేదా జీపీఎస్ ఆధారిత టోల్ కలెక్షన్ సిస్టమ్ అంటారు. శాటిలైట్ ఆధారిత టోల్ కలెక్షన్ సిస్టమ్ కారులో ఇన్‌స్టాల్ చేసిన ఆన్ బోర్డ్ యూనిట్ సహాయంతో పనిచేస్తుంది. దీని సహాయంతో ఉపగ్రహం మీరు ప్రయాణించిన దూరాన్ని ట్రాక్ చేస్తుంది. హైవేలపై ఏర్పాటు చేసిన కెమెరాల ఆధారంగా వాహన సమాచారం ఉపగ్రహానికి అందుతుంది. ఆన్ బోర్డ్ యూనిట్‌తో లింక్ చేసిన వాలెట్‌లో ఉండే డబ్బులు టోల్ రూపంలో కట్ అవుతాయి. ఆన్‌బోర్డ్ యూనిట్‌ను వాహనదారులు తమ వాహనాల్లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చే వాహనాల్లో ఈ వ్యవస్థ ఇన్‌బిల్ట్‌గా వచ్చే అవకాశం ఉంది. జీపీఎస్ ఆధారంగా టోల్ వసూలు చేసే ఈ విధానం ప్రపంచంలోనే మొదటిదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. కొత్త టోల్ వసూలు విధానం అమలులోకి రావడంతో డ్రైవర్లు టోల్ వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల హైవేపై ట్రాఫిక్ జామ్ జరగదు, దీంతో సమయం వృథా అవ్వదు. ఈ విధానంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు
# మిస్ అయ్యారా..

### భారీ నష్టం తప్పదు

**విశ్వంభర(బిజినెస్) :** 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలుకు జూలై 31 చివరి తేదీ. గడువు సమయంలోపు ఫైలింగ్ ప్రక్రియ పూర్తి చేయకపోతే మూడు నష్టాలు కలగనున్నాయి. చాలా మంది చివరి క్షణం వరకు ఆలస్యం చేసి తర్వాత గడువు పొడిగించలేదని షాక్ అవుతుంటారు. 1. పన్ను చెల్లింపుదారులు జూలై 31 గడువు సమయానికి రిటర్న్ ఫైలింగ్ పూర్తి చేయటంలో విఫలమైతే పాత పన్ను విధానంలో తేదీ తర్వాత.. ఓల్డ్ టాక్స్ రీజిమ్ కింద రిటర్న్‌ను ఫైల్ చేయలేరు. ఎందుకంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి కొత్త పన్ను విధానం డిఫాల్ట్ ఎంపికగా ఉండటమే దీనికి కారణం. అంటే ఈ లెక్కన ఆర్థిక సంవత్సరం పూర్తయ్యాక పన్ను రిటర్న్ ఫైల్ చేసే వ్యక్తులు తప్పనిసరిగా కొత్త టాక్స్ రీజిమ్ కింద ఐటీఆర్ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇదే జరిగితే వారు తమ మినహాయింపులను, పన్ను తగ్గింపులను పొందలేరని గుర్తుంచుకోవాలి. ఇక్కడ వారు ఈ ప్రయోజనాలు లేని కొత్త పన్ను విధానంలోకి మార్చబడతారు. అందువల్ల వ్యాపార ఆదాయం లేని జీతం పొందే పన్ను చెల్లింపుదారులు, పాత పన్ను విధానాన్ని ఎంచుకున్న వారు గడువు తేదీకి ముందే ఐటీఆర్ ని ఫైల్ చేయాలని దిల్లీకి చెందిన సంస్థ పిడి గుప్తా కంపెనీ భాగస్వామి చార్టర్డ్ అకౌంటెంట్ ప్రతిభా గోయల్ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు.




- ఇక టాక్స్ పేయర్స్ తమ ఐటీఆర్ గడువు తర్వాత ఫైల్ చేయటం వల్ల కలిగే రెండో నష్టం పెనాల్టీ. జూలై 31 డెడ్‌లైన్ మిస్ అయినందున ఆదాయపు పన్ను శాఖ ఆదాయపు పన్ను చట్టం లోని సెక్షన్ 234ఎఫ్ కింద రూ.5,000 ఆలస్య మైన ఫైలింగ్ రుసుమును విధించబడతారు. ఇదే క్రమంలో సదరు వ్యక్తి వార్షిక ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉన్నట్లయితే లేటు ఫైలింగ్ రుసుము రూ.1,000కి తగ్గించబడింది. ఈ క్రమంలో లేటుగా ఫైల్ చేసిన ఐటీఆర్ ప్రకారం ఏదైనా పన్ను చెల్లించాల్సి ఉన్నట్లయితే గడువు తేదీ నుంచి బకాయి ఉన్న పన్ను మొత్తంపై ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234 ప్రకారం నెలకు 1 శాతం చొప్పున వడ్డీ వసూలు చేయబడుతుంది.
- ఇక లేటు ఐటీఆర్ ఫైలింగ్ కారణంగా కలిగే అతిపెద్ద నష్టం వారు ఓల్డ్ టాక్స్ రీజిమ్ కింద మిస్ కావటం వల్ల కలుగుతుంది. ఈ క్రమంలో టాక్స్ పేయర్స్ తమ స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ప్రాపర్టీలు లేదా వారి వ్యాపారంలో ఏదైనా పెట్టుబడి పెట్టడం వల్ల కలిగిన క్లెయిమ్ చేసుకునేందుకు తర్వాతి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేయలేరు. తర్వాతి సంవత్సరాల్లో వచ్చిన లాభాలను ప్రస్తుత నష్టాలకు వ్యతిరేకంగా సెటాఫ్ చెసుకునేందుకు ఉన్న అవకాశాన్ని లేటుగా పన్ను రిటర్న్ దరఖాస్తు చేయటం వల్ల కోల్పోవాల్సి ఉంటుందని, నష్టాలను కొనసాగించడానికి మీరు అనుమతించబడరని చార్టర్డ్ అకౌంటెంట్ చౌహాన్ పేర్కొన్నారు.

విశ్వంభర
V3 NEWS



# యువ దర్శకుడితో అల్లరి నరేశ్

**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్లో ఇండస్ట్రీ జనా లే కాక ప్రేక్షకులు కూడా ఎంతో ఇష్టపడే హీరోల్లో అల్లరి నరేష్ ఒకడు. ఒకప్పుడు అతను కామెడీ సినిమాలతో అంతగా నవ్వించాడు మరి. అంతే కాక తన ప్రవర్తన కూడా చాలా హుందాగా ఉంటుంది. వివాదాలకు పూర్తి దూరంగా ఉంటాడు. అందుకే అతను అందరికీ ఇష్టుడు. అల్లరోడు సరైన హిట్ లేక ఇబ్బంది పడుతుంటే అందరూ బాధపడ్డవాళ్లే. తనకు 'నాంది' సినిమాతో మళ్లీ ఓ మంచి సక్సెస్ వస్తే అందరూ అంత సంతోషించారు కూడా. కానీ ఆ సక్సెస్‌ను అతను నిలబెట్టుకోలేకపోయాడు. ఉగ్రం, మారేడుమిల్లి నియోజకవర్గం, ఆ ఒక్కటీ అడక్కు.. ఇలా చివరి మూడు చిత్రాలూ నిరాశపరిచాయి. ఇప్పుడు తన ఆశలన్నీ 'బచ్చల మల్లి' మీదే ఉన్నాయి. ఈ సినిమా ప్రోమోలు బాగానే ఉన్నాయి. ఐతే 'బచ్చల మల్లి' కంటే కూడా నరేష్ చేయబోయే కొత్త సినిమా ఇంకా ప్రామిసింగ్‌గా కనిపిస్తోంది. ఆ చిత్రం శనివారమే ప్రారంభోత్సవం జరుపుకుంది. 'ఫ్యామిలీ డ్రామా' అనే వెరైటీ థ్రిల్లర్ మూవీ తీసి మెప్పించిన మెహర్ తేజ్ అనే యువ దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించనున్నాడు. సితార ఎంటర్టైన్మెంట్స్ లాంటి పెద్ద సంస్థ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తోంది. నరేష్ వరుసగా సినిమాలైతే చేస్తున్నాడు కానీ.. పెద్ద బేనర్లలో తనకు ఛాన్సులు రావట్లేదు. సితార లాంటి బేనర్లకు ఉన్న గుడ్ విల్ వల్ల సినిమాలకు రీచ్ ఎక్కువ ఉంటుంది. ప్రమోషన్లు కూడా గట్టిగా చేస్తారు. 'ఫ్యామిలీ డ్రామ' తీసిన దర్శకుడంటే నరేష్ నుంచి ఒక వెరైటీ సినిమాను కూడా ఆశించవచ్చు. కాబట్టి ఈ చిత్రంతో అల్లరోడి దశ తిరుగుతుందని ఆశించవచ్చు. ఈ చిత్రంలో రుహాని శర్మ కథానాయికగా నటించనుంది.



# సొగసుచూడతరమా..

**విశ్వంభర, సినిమా :** మలయాళంలో ప్రేమమ్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఉంగరాల జుట్టు సుందరి అనుపమ పరమేశ్వరన్. అఆ సినిమాతో టాలీవుడ్ లో పరిచయమై తొలి సినిమాతోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది అనుపమ. ఆతర్వాత వరుస సినిమాలతో దూసుకుపాయింది సొగసరి. వరుసగా యంగ్ హీరోల సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది బ్యూటి. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేసింది. తాజాగా టిల్లు స్క్వేర్ సినిమా ఘన విజయం సాధించటంతో అనుపమ క్రేజ్ హై స్థాయికి చేరుకుంది. ఇప్పుడు ఈ చిన్నది తెలుగు కన్నా, మలయాళం, తమిళ సినిమాలతో చాలా బిజీగా ఉంది. తెలుగులో ఒక ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమా పరదా చేస్తున్నట్లు సమాచారం. 'టిల్లు స్క్వేర్' సినిమాలో అనుపమ తాను గ్లామర్ వైపు కోణాన్ని కొత్తగా చూపించింది. అందులో చాలా గ్లామరస్ గా కనపడటమే కాకుండా, తాను అవసరమైతే గ్లామర్ పాత్రలకు రెడీ అన్న సంకేతాలని పంపించింది. ఆమె ఎప్పుడూ ఇన్స్టాగ్రాంలో తన తాజా ఫోటోలు పెడుతూ అభిమానులతో టచ్‌లో ఉంటూ ఉంటుంది. రీసెంట్ గా గ్లామర్ గేట్లు ఎత్తేసింది అనుపమ పరమేశ్వరన్. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులకు మంచి కిక్ ఇస్తున్నాయి. అమ్మడి ఫోటోలకు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉంది. అనుపమ షేర్ చేసే ఫోటోలకు సోషల్ మీడియాలో నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అయితే కొంతమంది మాత్రం హద్దు దాటి కామెంట్స్ చేస్తున్నారు. తమిళంలో 'బైసన్', 'లాక్ డౌన్' అనే రెండు సినిమాలలో నటిస్తోంది. 'బైసన్' లో విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ కథానాయకుడిగా చేస్తున్నాడు. మారి సెల్వరాజ్ దర్శకుడు, ఇది ఒక స్పోర్ట్స్ నేపథ్యంలో వుండే సినిమా అని అంటున్నారు. ఇంకో తమిళ సినిమా 'లాక్ డౌన్'. దీనికి ఏఆర్ జీవా దర్శకుడు, ఇందులో అనుపమ ఒక వైవిధ్యమైన పాత్రలో కనపడనుందని అంటున్నారు. మొత్తానికి రెండు తమిళం, రెండు మలయాళం, ఒక తెలుగు సినిమాతో అనుపమ బిజీగా వుంది.



# పవన్ కొత్త సినిమా ఎప్పుడంటే?

**విశ్వంభర, సినిమా :** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో ఫుల్ బిజీగా ఉన్నారు. అయినప్పటికీ, అటు సినిమాల్లో కూడా పవన్ బిజీ కానున్నారు. ఈ నేపథ్యంలోనే పవన్ కొత్త సినిమా అప్ డేట్ బయటకు వచ్చింది. దర్శకుడు సురేందర్ రెడ్డితో పవన్ కళ్యాణ్ ఓ మూవీ చేయనున్నారు. ఎస్సార్టీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రామ్ తాళ్లూరి ఈ సినిమాని ఘనంగా నిర్మించనున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో భాగంగా ఈ మూవీ గురించి నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ, దర్శకుడు సురేందర్ రెడ్డితో పాటు మా టీమ్ అంతా ఈ మూవీ కోసం రెడీగా ఉన్నాం. అయితే, పవన్ గారి నుంచి గ్రీన్ సిగ్నల్ తో పాటు ఆయన కాల్షీట్స్ లభించాల్సి ఉంది' అంటూ ఆయన చెప్పుకొచ్చారు. మొత్తానికి ఈ మూవీని గ్రాండ్ లెవెల్లో ప్లాన్ చేస్తున్నారట. ఇక ప్రస్తుతం పవన్ పిఠాపురం ఎమ్మెల్యే గా, ఆంధ్ర డిప్యూటీ సీఎంగా తన సేవలు అందిస్తున్నారు.

## గ్లామర్‌తో రెచ్చగొడుతున్న శ్రీముఖి

**విశ్వంభర, సినిమా :** నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన శ్రీముఖి.. యాంకర్‌గా టర్న్ తీసుకుని మంచి పాపులారిటీ తెచ్చుకుంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఘాటైన ఫోటోలు పోస్ట్ చేసింది. బుల్లితెరపై యాంకర్‌గా, వెండితెరపై యాక్టర్‌గా కెరీర్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటూ దూసుకుపోతుంది శ్రీముఖి. పటాస్ షోతో ఈ బ్యూటీకి తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ తర్వాత పలు షోలు, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లతో బిజీ బిజీగా గడుపుతుంది.ఈ బ్యూటీ బిగ్ బాస్ మూడో సీజన్‌లోను కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చి రన్నర్ అప్‌గా నిలిచింది. ఈ షో తర్వాత ఈ బ్యూటీకి మరింత ఫాలోయింగ్ పెరిగింది. ప్రస్తుతం ఈ బ్యూటీ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు కూడా చేస్తుంది. అదే ఏడాది శేఖర్ కమ్ములా దర్శకత్వంలో వచ్చిన 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' సినిమాలోనూ ఈ స్టార్ యాంకర్ మెరిసింది. ఆ తర్వాత ఏడాది పవన్ సాదినేని దర్శకత్వం వహించిన 'ప్రేమ ఇష్క్ కాదల్' సినిమాతో హీరోయిన్ అవతారం ఎత్తింది. అయితే ఈ సినిమా ఫ్లాప్ అవడంతో శ్రీముఖి హీరోయిన్‌గా నిలబడలేకపోయింది. అయితే ఆ తర్వాత ఏడాది ఈ బ్యూటీ తమిళం, కన్నడలోనూ సినిమాలు చేసింది. ఇక నేను శైలజా, జెంటిల్ మెన్, భోళా శంకర్ ఇలా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెగ బిజీగా మారిపోయింది. ఓ వైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు యాంకర్‌గానూ చెలరేగిపోతుంది.

# రైతుగా దుల్కర్ సల్మాన్

**విశ్వంభర, సినిమా:** మహానటి'తో తెలుగువారికి చేరువయ్యారు నటుడు దుల్కర్ సల్మాన్ ఇటీవల 'కల్కి'లో అతిథి పాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు. ఆయన హీరోగా నటించనున్న కొత్త సినిమా వివరాలు వెల్లడయ్యాయి. 'సావిత్రి', 'సేనాపతి' చిత్రాలను తెరకెక్కించిన పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సినిమా చేయనున్నారు. గీతాఆర్ట్స్, స్వప్నా సినిమాస్, లైట్‌బాక్స్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'ఆకాశంలో ఒక తార' టైటిల్ ఫిక్స్ చేశారు. ఆదివారం దుల్కర్ పుట్టినరోజు పురస్కరించుకుని ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. పోస్టర్‌ని బట్టి మనసుని హత్తుకునే కథతో ఇది సిద్ధమవుతుందని తెలుస్తోంది. దీనిని చూసిన పలువురు సినీ ప్రియులు ఆయనకు కంగ్రాట్స్ చెబుతున్నారు. ఇక దుల్కర్ అప్‌కమింగ్ మూవీస్ విషయానికి వస్తే, ప్రస్తుతం ఆయన 'లక్కీ భాస్కర్' అనే పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నారు. 'సార్' ఫేమ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి ఈ సినిమాను పాన్ ఇండియా లెవెల్‌లో తెరకెక్కిస్తున్నారు. ఇందులో స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి ఫీమేల్ లీడ్‌గా కనిపించనుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ ఈ సినిమాకు చక్కటి స్వరాలు అందిస్తున్నారు. ఇటీవలే వచ్చిన 'శ్రీమతి గారు' సాంగ్ మ్యూజిక్ లవర్స్‌ను తెగ ఆకట్టుకుంది. బ్లాక్ మనీ నేపథ్యంలో సాగనున్న ఈ మూవీ సెప్టెంబర్‌లో ప్రేక్షకుల వచ్చేందుకు సిద్ధమవుతోంది.

# గ్యాస్ సమస్యకు పాటించాల్సిన చిట్కాలు

**విశ్వంభర, ఫీచర్:** సమయానికి భోజనం చేయకపోవడం వల్ల పొట్టలో గ్యాస్ సమస్య మొదలవుతుంది. కారణాలు ఏవైనా కానీ పొట్టలో గ్యాస్ మొదలైతే, అది దీర్ఘకాలం పాటు వేధించే సమస్యగా మారుతుంది. చాలామంది మందులు వేసుకుంటేనో లేదంటే ఇతర మార్గాల ద్వారా దీనిని తగ్గించుకోవచ్చు అనుకుంటారు. కానీ ఆహారం, జీవన శైలిలో మార్పులతో గ్యాస్ ను తగ్గించుకోవచ్చు. అవసరమైతే మందులను వాడటం ద్వారా పొట్టలో గ్యాస్ సమస్యలను నివారించుకోవచ్చు అని వైద్యులు చెబుతున్నారు. దానిని ఎలా నియంత్రించాలో చూద్దాం.



**ఈ మార్పులు అవసరం**

మన జీవనశైలిలో, ఆహారంలో మార్పులు చేసుకోవటం ద్వారా ఈ సమస్య నుంచి బయట పడొచ్చుని నిపుణులు చెబుతున్నారు. పొట్టలో గ్యాస్ సమస్యను తీవ్రతరం చేసే పొగతాగడం, కాఫీ తాగడం, చాక్లెట్లు తినడం లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉన్న ఆహారాలను తినాలని సలహా ఇస్తున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, క్యాలీఫ్లవర్, బ్రొకొలి, దోసకాయలు తింటే మేలు అని చెబుతున్నారు.

**తప్పులు అసలు చేయకండి**

మనలో చాలామందికి తిన్న వెంటనే నిద్రకు ఉపక్రమించే అలవాటు ఉంటుంది. ఇది పొట్టలో గ్యాస్ సమస్యను మరింత తీవ్రం చేస్తుందని వైద్యులు అంటున్నారు. తిన్న వెంటనే నిద్రపోతే అరగక ఆహారం నోట్లోకి వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. చికెన్, చేపలు లాంటి వాటిని ఉడికించి లేదా కాల్చినా మంచిదే కానీ, వాటికి ఆయిల్ కలిపి ఏం చేసినా గ్యాస్ సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు వైద్యులు.

**పొట్టలో గ్యాస్ సమస్య మరీ వేధిస్తుంటే నివారణగా కింద పేర్కొన్న చిట్కాలను పాటించవచ్చు.**

**పుదీనా/పుదీనా టీ:** పుదీనా ఆకులను నమిలినా లేదంటే పుదీనా టీ తాగినా పొట్టలో గ్యాస్ సమస్య నుంచి త్వరిత ఉపశమనం కలుగుతుంది.

**చమోమిలే టీ (చామంతి):** చామంతితో చేసిన టీని తాగితే కూడా మంచి ఫలితం లభిస్తుంది.

**యాక్టివేటెడ్ చార్ కోల్ ట్యాబ్లెట్లు:** పొట్టలో అధిక గ్యాస్ వేధిస్తున్నప్పుడు గ్యాస్ సమస్య నుంచి విముక్తి కోసం యాక్టివేటెడ్ చార్ కోల్ ట్యాబ్లెట్లను డాక్టర్ల సలహా మేరకు వేసుకుంటే ఉపశమనం పొందవచ్చు.

**ఆపిల్ సైడర్ వెనిగర్:** పొట్టలో గ్యాస్ సమస్య వేధిస్తున్నట్లయితే నీళ్లు, టీతో కానీ ఆపిల్ సైడర్ వెనిగర్ కలుపుకొని తాగితే సత్వర ఉపశమనం లభిస్తుంది.

**లవంగాలు:** గ్యాస్ సమస్య మరీ తీవ్రంగా వేధిస్తుంటే లవంగాలను తింటే మంచింది. లవంగాలు నూనెను ఆహారంలో వాడటం ద్వారా కూడా ఉపశమనం పొందవచ్చు.

# అల్లంతో అలసటకు చెక్

**విశ్వంభర, ఫీచర్ :** మనం రోజూవారి వంటల్లో వాడే పదార్థాల్లో ఒకటి అల్లం. కూరలు, గ్రేవీల్లోనే కాకుండా స్నాక్స్, చాట్‌లలోనూ మంచి ఘాటు రుచికి దీన్ని వాడతారు. ఇక వర్షాకాలంలో తరచూ పలకరించే జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలకు అల్లం చాయ్, అల్లం పాలతో చెక్ పెట్టేయొచ్చు. అల్లంలో మన శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రొటీన్స్ లభిస్తాయి. అయితే, అల్లాన్ని కూరల్లో భాగంగా తీసుకుంటే ఫలితం పరిమితంగానే ఉంటుందట. పరగడుపున చిన్న ముక్కలు తీసుకుంటే అధిక ప్రయోజనాలు ఉంటాయని నిపుణుల మాట. ఉదయాన్నే ఒక టీ స్పూన్ అల్లం రసం తీసుకున్నా.. మంచి ఫలితం వస్తుందట. ఇలా చేస్తే రోజంతా హుషారుగా ఉంటారట. ఉదయాన్నే అర అంగుళం అల్లం ముక్కను, తేనెతో తీసుకుంటే.. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఫలితంగా గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలు దూరమవుతాయి. క్రమం తప్పకుండా అల్లం తీసుకోవడం వల్ల కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. నోటి దుర్వాసన కూడా పారిపోతుంది. రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు దగ్గు, జలుబు లాంటి సీజనల్ వ్యాధులు పీడించకుండా అల్లం అడ్డుగా నిలుస్తుంది.



రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
విశ్వంభర తెలుగు దినపత్రిక
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com